## సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యం




3లో


# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd



## ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత అభినందనీయం




3లో


Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 104 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 11 ఏప్రిల్ 2026


## పేదల ప్రభుత్వంపై ప్రతిపక్షాల
# బురద రాజకీయం

- వారికంటిన బురదను మాకు అంటించే ప్రయత్నం
- సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం,ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతిపక్షానికి చెందిన కొంతమంది వారికి అంటిన బురదని అధికార పార్టీకీ, అధికార పార్టీ నాయకులకు అంటించాలని చూస్తున్నారని ఎవరు ఎన్ని కారుకూతలు కూసినా భవిష్యత్తు లో ఇందిరమ్మ ప్రభుత్వంని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మిగతా2లో...




## రాజ్యసభ సభ్యుడిగా
# నితీశ్ ప్రమాణం

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శుక్రవారం రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ మిగతా2లో...

## ప్రారంభోత్సవానికి రెడీ అవుతున్న
# భోగాపురం

- జూలైలో ప్రారంభోత్సవానికి తేదీలు ఖరారు
- జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన డేట్లు ఫిక్స్ చేసిన ప్రభుత్వం
- ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీకి ఆహ్వానం



**విశాఖపట్నం,ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఏపీ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. జూలై మొదటి వారంలో ఈ విమానాశ్రయం ప్రారంభం కానుండటంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోనున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు తుది దశకు చేరుకున్నాయి. జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇప్పటికే ఆహ్వానం పంపారు. మోదీ షెడ్యూల్ ఆధారంగా జూలై 5వ తేదీ లేదా 8వ తేదీల్లో ఒకటి ఖరారు కానుంది. జూన్ 30వ తేదీ కల్లా మిగిలిన అన్ని పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తున్నారు. అంతర్జాతీయ విమానాల రాకపోకల కోసం అవసరమైన ఇమ్మిగ్రేషన్ స్టేటస్ నోటిఫికేషన్‌ను త్వరగా మిగతా2లో...



# పిచ్చి వాగుడు వాగితే ఖబర్దార్

- అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లపై దుష్ప్రచారమా: మండిపడ్డ మంత్రి సీతక్క

**భద్రాద్రి కొత్తగూడెం,ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని స్త్రీ శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. అంగన్వాడీ అంటే అమ్మఒడి అంటూ సీతక్క అభివర్ణించారు. మినీ అంగన్వాడీలను కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా2లో...

## పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై
# కాంగ్రెస్ ఫోకస్


- మహిళా బిల్లు, డిలిమిటేషన్ అంశాలపై చర్చ
- ఈ రెండు అంశాలపై కాంగ్రెస్ సుదీర్ఘ కసరత్తు
- రాజకీయ లబ్దికోసంమే ప్రత్యేక సమావేశాలన్న ఖర్గే
- తెలంగాణలో డీ లిమిటేషన్‌నూ రేవంత్ నివేదిక సమర్పణ



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** జాతీయ రాజకీయాల్లో రాబోయే మార్పులు, కేంద్ర ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సమాలోచనలు చేసింది. ముఖ్యంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. మహిళా బిల్లు, సీట్లు పెంపుదల వంటి రెండు అంశాలపై వ్యూహాత్మకంగా ఉండాలని నిర్ణయించారు. దేశ రాజధాని ఢిల్లీ ఇందిరాభవన్‌లో మిగతా2లో...

# పదేళ్లలో తెలంగాణను ఆగం చేశారు


- ఇప్పుడేమో ఘనకార్యాలు చేసినట్లు బిల్డప్
- హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ జూపల్లి



**హైదరాబాద్,ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** గత ప్రభుత్వ నాయకులకు సరైన ఆలోచన, అవగాహన లేక రాష్ట్రానికి తీవ్ర నష్టం చేశారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. నీళ్లు లేని చోట మాత్రం పదేళ్లలో అనేక ప్రాజెక్టులు కట్టారని విమర్శించారు. కాళేశ్వరం ఇందుకు నిదర్శనమని అన్నారు. పలమూరులో పదేళ్లుగా ఒక్క పని చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ధనిక రాష్ట్రం అప్పగిస్తే, రూ.8 లక్షల కోట్లు ఎందుకు అప్పు చేశారని మిగతా2లో...

## కాళేశ్వరాన్ని రెండేళ్లుగా
# ఎందుకు నానబెట్టారు

- ఇప్పుడే రిపేర్లు చేయడంలో ఆంతర్యం ఏమిటో..?
- గతంలోనే చేసివుంటే రైతులకు మేలు జరిగేది కదా..?
- కేవలం కమిషన్ల కోసమేనేమో అన్న అనుమానాలు
- రియల్ ఎస్టేట్ కోసమే ఫ్యూచర్ సిటీ జపం
- జిహెచ్ఎంసిలో తీవ్ర అవినీతి జరుగుతోంది
- మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్,ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. రెండున్నరేళ్లు దారుణంగా వ్యవహరించి పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ న ఇర్ణయం తీసుకుని ఉంటే రైతులకు మేలు జరిగి ఉండేదని అన్నారు. హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ..కమిషన్ల కోసమే ఇప్పుడు కాళేశ్వరానికి మరమ్మతులు అంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్, అర్బన్ ఫారెస్ట్రీలో తీవ్రమైన అవినీతి జరుగుతోందన్నారు. రియల్ ఎస్టేట్ కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్‌కు నష్టం చేయవద్దని కోరారు. అలాగే జీహెచ్ఎంసీలో తీవ్ర అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. అనేక గ్రామాలు జీహెచ్ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హెచ్ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగించలేదని కవిత ఆరోపించారు. హెచ్ఎండీఏకు ఛైర్మన్‌గా, వైస్ ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. 2017 నుంచి 2021 వరకు 480 కోట్ల రూపాయల పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మిగతా2లో...

## రాష్ట్రపతి, ప్రధానులతో
# గవర్నర్ భేటీ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి, ప్రధానులను మిగతా2లో...



## అన్నా.. నన్ను దేవుడే
# పంపిండు...

## మీతో కలిసి పని చేయమని చెప్పిండు



- ఎర్రవల్లిలో కెసిఆర్‌తో జీవన్ రెడ్డి భేటీ
- ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని పలకించిన కెసిఆర్

**గజ్వేల్,ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను పలకరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. ' అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని' అంటూ కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మిగతా2లో...




# డిజిపి ఎదుట లొంగిపోయిన కేశాలు

- మొత్తం 42 మంది ఆయుధాలతో లొంగుబాటు
- వారికి పునరావాసం కల్పిస్తామన్న శివధర్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ పోలీసుల ఎదుట మావోయిస్టు అగ్రనేత, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ డిప్యూటీ కమాండర్ సోడిమల్ల కేశాలు లొంగిపోయారు. అతనితోపాటు మొత్తం 42 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు. ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల నుంచి వచ్చి వీరంతా మిగతా2లో...

# ప్రారంభోత్సవానికి రెడీ అవుతున్న భోగాపురం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్ పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేసింది. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. విశాఖపట్నం నుంచి భోగాపురం వెళ్లే మార్గంలో అత్యంత రద్దీగా ఉండే ఆనందపురం జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ఫ్లై ఓవర్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. దీనికి సంబంధించిన డీపీఆర్ 45 రోజుల్లో సిద్ధం కానుంది. భోగాపురం వరకు మెట్రో సౌకర్యాన్ని కల్పించేందుకు సంస్థ సవరించిన డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. ఇది డబుల్ డెక్కర్ మోడల్‌లో ఉండబోతోంది (కింద రోడ్డు, పైన మెట్రో). విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి భోగాపురం వరకు ఈ కారిడార్ విస్తరించనుంది. రోడ్ నంబర్ 12, 14 పనుల కోసం అటవీ, రక్షణ శాఖల అనుమతులను వేగవంతం చేశారు. తీర ప్రాంతం వెంట విశాఖను భోగాపురంతో కలిపే ప్రత్యేక కోస్టల్ కారిడార్ పనులు కూడా ఊపందుకున్నాయి. భోగాపురం ఎయిరోసిటీ, ఐటీ హబ్స్, లాజిస్టిక్ పార్కుల వల్ల ఈ ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి లభించనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ విమానాశ్రయం వల్ల ఉత్తరాంధ్రలోని పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది. ఫార్మా, మత్స్య పరిశ్రమల ఎగుమతులకు ఈ విమానాశ్రయం కేంద్ర బిందువుగా మారనుంది. భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు త్వరలో పూర్తవుతాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. కేంద్రప్రభుత్వ సహకారంతో ఏపీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు జూలై మొదటి వారంలో ప్రారంభించాటానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఇదో మైలు రాయని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభించటానికి ప్రయత్నిస్తున్నామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై కాంగ్రెస్ ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీసమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఈ భేటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం ప్రారంభమైంది. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా సోనియా గాంధీ, సీనియర్ నేత పి. చిదంబరం వర్చువల్‌గా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సల్మాన్ ఖుర్షీద్, అంబికా సోనీ, సచిన్ పైలట్, భూపేశ్ బగేల్ తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు ఈ సమావేశంలో పాల్గొని తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధానంగా ఈ క్రింది అంశాలపై తన వాణిని వినిపించాలని నిర్ణయించింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరిని ఖరారు చేయనుంది. ఓబీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలనే డిమాండ్‌పై కూడా చర్చించారు. 2026 తర్వాత జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య తమ వాదనలు వినిపించారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, భారతదేశంపై వాటి ప్రభావం, భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై చర్చించారు. కేవలం మూడు రోజుల పాటు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోయే బిల్లులను ఎలా అడ్డుకోవాలి లేదా చర్చలో ఎలా పైచేయి సాధించాలనే అంశంపై సభ్యులకు కాంగ్రెస్ అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నరేంద్రమోదీ ప్రభుత్వం అనూహ్యంగా ప్రత్యేక సమావేశాలను పిలవడంతో ఈ అచిఅ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా తెలంగాణ వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీ బలోపేతంపై సీఎం రేవంత్‌రెడ్డి సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక ప్రసంగం చేసే అవకాశం ఉంది. సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఎన్నికల ప్రయోజనాల కోసమేనని చెప్పారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రతిపాదన కాంగ్రెస్ ముందుకు రాలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలోనే మహిళా రిజర్వేషన్లపై స్పష్టతని ఇచ్చామని, కేంద్రాన్ని డిమాండ్ కూడా చేశామని ప్రస్తావించారు. వెస్ట్ బెంగాల్, తమిళనాడు ఎన్నికలు జరుగుతున్న వేళ హఠాత్తుగా మహిళా రిజర్వేషన్ల బిల్లు సవరణ , పునర్విభజన చట్టం సవరణ బిల్లులను తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక అఖిలపక్ష సమావేశం పెట్టాలని పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీలన్నీ కోరాయని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తమ ప్రయోజనాల కోసం ప్రయత్నం చేస్తుందని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

# కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు

(మొదటి పేజీ తరువాయి)

మరో 1,140 కోట్ల రూపాయలను అదే పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని వెల్లడించారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. రూ.50 కోట్ల టెండర్ వేస్తే దాదాపు 50 శాతం తిరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని.. కానీ నామినేషన్ పద్ధతిలో ఇలాంటి లాభం లేకపోవడం అవినీతికి దారితీస్తోందని ఆరోపించారు. నర్సరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 6 వేల మంది స్కిల్డ్ లేబర్‌కు 23,800 రూపాయలు ఇవ్వాల్సి ఉందని కవిత తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఒక కంపెనీపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ వేయించారని.. తర్వాత ఏమైందో తెలియాలని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డులో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టును రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక కూడా కొనసాగిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఆరోపణలు చేసిన రేవంత్ దీనిని ఎలా కొనసాగిస్తారని అన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌పై ముఖ్యమంత్రి దృష్టి పెడుతున్నారని.. సీఎం దగ్గర బ్యాగులు మోసే వ్యక్తి చెప్పినట్టు మాత్రమే పనులు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. జీహెచ్ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలనలో జరుగుతున్న మహా అవినీతి అని వ్యాఖ్యానించారు. అవినీతి కోసమే సీఎం 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారని కవిత అన్నారు. నెల 25వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. 500 మంది వలంటీర్లు సేవలు అందిస్తారని తెలిపారు. మహిళా బిల్లు అమలు కాకపోవడంతో 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు నష్టపోయారని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ధర్మపురి అరవింద్‌లో పురుష అహంకారం కనిపిస్తోందని.. ప్రజలు ఆయన్ను ఎప్పుడో మర్చిపోయారని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నాను... ఎవరో చెప్తే పార్టీ పెట్టే స్థాయిలో లేను' అని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను కేరళం ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తాము వీడియో రిలీజ్ చేశామని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

## పేదల ప్రభుత్వంపై ప్రతిపక్షాల బురద రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో 1.52 కోట్లతో నిర్మించిన ప్యాక్స్ గోదాములను ప్రారంభించారు. అలాగే మండలంలో 191 మంది లబ్దిదారులకు మంజూరైన రూ. 58.58 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలిన ఈ ప్రభుత్వం పేదవారికి అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ధాన్యం కొన్న వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతును రాజు చేయడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. కేవలం నాలుగు నెలల్లోనే రూ. 20,670 కోట్ల మేర రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించామని ఏడాదికి ఎకరానికి రూ. 12 వేలు అందిస్తూ, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త గా 3.80 లక్షల మందికి పాస్ పుస్తకాలను అందజేశామన్నారు. ధరణి తో రైతులు ఇబ్బందులు పడ్డారని దాన్ని బంగాళాఖాతంలో వేసి భూ భారతి తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం వెంకటాపురంలో దేపంగి శ్రీకాంత్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న మంత్రి.. అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి పుల్లయ్య, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పిచ్చి వాగుడు వాగితే ఖబర్దార్

(మొదటి పేజీ తరువాయి)

అప్ గ్రేడ్ చేసిందని.. ఆ టీచర్లకు ఇప్పుడు రూ.2 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్లు కూడా ఇస్తున్నామని పేర్కొన్నారు. అంగన్వాడీలకు గతంలో సెలవులు కూడా ఉండేవి కాదని.. కాంగ్రెస్ సర్కార్‌లో వారికి సెలవులు ఇస్తున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీకి దక్కుతుందని ప్రశంసించారు. మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో అంగన్వాడీ టీచర్లకు మంత్రి సీతక్క స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. స్మార్ట్ ఫోన్లు పంపిణీ సందర్భంగా తనపై వస్తున్న ఆరోపణలను సీతక్క ఖండించారు. తనపై కొంతమంది పిచ్చి వాగుడు వాగుతున్నారని ఆగ్రహించారు. అసత్య ప్రచారాలతో అబద్దాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సెల్ ఫోన్ల కొనుగోలుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆన్ లైన్ టెండర్లు వేసిందని.. ఎక్కడా అవినీతి జరగలేదన్నారు. కేంద్రం ఇచ్చిన గైడ్ లైన్ల ద్వారా మాత్రమే రూ.11,600 తక్కువ రేటుతో సెల్ ఫోన్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఫోన్లు కొన్నది రూ.11 వేలకే అయితే రూ.14 వేలకు కొన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు సీతక్క. పేదలకు మంచి చేసే తమ లాంటి వాళ్ల మీద చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్న వారికి లీగల్ నోటీసులు ఇస్తామని మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పని చేసినా గత ప్రభుత్వ పాలకులకు నిద్రపట్టడం లేదని విమర్శించారు. నిజాలు ఉంటే నిరూపించాలని, అంతేగాని బట్ట కాల్చి మీద వేస్తామంటే ఉరుకునే పరిస్థితి లేదని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

# పదేళ్లలో తెలంగాణను ఆగం చేశారు

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు కాలువలకు ఇంకా అనుమతే రాలేదన్న జూపల్లి.. పాలమూరు ప్రాజెక్టుపై రాజకీయాలు చేస్తోంది మీరా? మేమా? అని నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టును 80శాతం పూర్తి చేశామని అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. అబద్దాలతోనే పాలన చేశారని, ప్రజలను మోసం చేశారని అన్నారు. హరీష్ వ్యాఖ్యలపై మంత్రి మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తయ్యాయని హరీశ్‌రావు చెబుతున్న మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. రూ.80 వేల కోట్ల అంచనా వ్యయం ఉన్న ప్రాజెక్టులో కేవలం రూ.25 వేల కోట్లు ఖర్చు చేసి 80 శాతం పనులు ఎలా పూర్తి చేశారని నిలదీశారు. కనీసం కాలువల నిర్మాణం పూర్తి చేయలేదని, భూసేకరణ చేపట్టలేదని, పరిపాలనా అనుమతులు కూడా లేవని విమర్శించారు. ఎన్నికల ముందు హడావుడిగా పంపులు ఆన్ చేసి ప్రజలను వంచించారు తప్ప, ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చారా? అని ప్రశ్నించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరుపై రూ. 7 వేల కోట్లు ఖర్చు చేస్తే, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు రూ. 8,300 కోట్లు వెచ్చించాయని గుర్తు చేశారు. గొల్లపల్లి రిజర్వాయర్ భూసేకరణలో భాగంగా 2.5 శాతం మంది రైతులకు మాత్రమే నష్టం వాటిల్లుతోందనని... కానీ 97.5 శాతం మంది రైతులకు ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు.

# రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

సి.పి రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో నితీష్‌కుమార్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. నితీష్‌కుమార్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, రాజ్యసభ నేత జెపి నడ్డా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లు హాజరయ్యారు. అలాగే జెడియు నేత, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజరు కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జైరాం రమేష్, బిజెపి ఎంపి మాజీ కేంద్రమంత్రి అయిన రాజీవ్ ప్రతాప్ రూడీ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్‌డిఎ తదుపరి బీహార్ సిఎం ఎవరనేది త్వరలోనే వెల్లడించనుంది. బహుశా ఏప్రిల్ 14న కొత్త ముఖ్యమంత్రిని ఎన్‌డిఎ ఎన్నుకునే అవకాశం ఉంది.

# అన్నా.. నన్ను దేవుడే పంపిండు...

(మొదటి పేజీ తరువాయి)

జీవన్ రెడ్డి , కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కేసీఆర్‌ను కలిసినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించారు. తాజా రాజకీయాలు, కాంగ్రెస్ తీరును ఆయన కెసిఆర్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి తొలిసారి వచ్చిన జీవన్ రెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.' తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్ల కైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది' అంటూ మనసులోని మాటను వ్యక్తం చేశారు. ఈ సంద్భంగా జీవన్‌రెడ్డిని కేసీఆర్ సన్మానించారు. జీవన్ రెడ్డి కూడా కెసిఆర్‌కు శాలువా కప్పి సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా ఉండి, తెలంగాణ తనానికి దర్పణంగా నిలిచే జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం, కేసీఆర్‌ను 'అన్నా' అని సంబోధిస్తూ భావోద్వేగానికి లోనవ్వడం చూస్తుంటే.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సంభవించబోతున్నాయని స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ఈ చేరిక ఒక పెద్ద ఊతమివ్వనుంది.

# డిజిపి ఎదుట లొంగిపోయిన కేశాలు

(మొదటి పేజీ తరువాయి)

లొంగిపోయారు. ములుగు, భూపాలపల్లి మీదుగా పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోతున్నట్లు ప్రకటించారు. అనంతరం సరిహద్దుల నుంచి పోలీసులు వీరిని వాహనాల్లో హైదరాబాద్‌కు తరలించారు. మావోయిస్టు నేత హిడ్మా గెరిల్లాను వదిలి దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీకి వెళ్లిన తర్వాత బెటాలియన్ బాధ్యతలను బడ్సే దేవాకు, కేశాలుకు అప్పగించారు. అయితే, కొన్ని రోజులు కిందటే కమాండర్ దేవా.. తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుపోయారు. ఆ తర్వాత బెటాలియన్ బాధ్యతలు నిర్వహిస్తున్న సోడిమల్ల కేశాలు సైతం తాజాగా శుక్రవారం లొంగిపోయారు. ఇతనికి సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ వంటి పేర్లున్నాయి. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. మొత్తం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయినట్లు తెలిపారు. వీరిలో గెరిల్లా బెటాలియన్ కమాండర్ సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ ఉన్నారని వెల్లడించారు. తెలంగాణ పోలీసుల ఎదుట ఆయుధాలు, బంగారంతో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసినట్లు చెప్పారు. 36 తుపాకులు, ఐదు ఏకే 47లు, నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, 1,007 తూటాలతో పోలీసులు ముందు మావోలు లొంగిపోయినట్లు పేర్కొన్నారు. అలాగే 800 గ్రాముల బంగారం సైతం అప్పగించినట్లు వెల్లడించారు. వీరి లొంగుబాటుతో అత్యంత కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ పూర్తిగా కనుమరుగైనట్లు డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు. గత ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా డీజీపీ ఎదుట లొంగిపోయారు. వీరిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ కేశాలు కూడా ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ పెరగడంతో మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయించారు. లొంగిపోయిన వారిలో ఒక్కరు మాత్రమే తెలంగాణకు చెందివారు కాగా.. ఎక్కువమంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. 'లొంగిపోయిన వారికి పునరావాస ప్యాకేజీ కింద రూ.1.93 కోట్లు అందజేస్తున్నాం. సీఎం ఆదేశాల మేరకు ఆరోగ్య కార్డులు అందజేస్తాం. తెలంగాణకు చెందిన వాళ్లు సెంట్రల్ కమిటీలో 11 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరున్నారు. స్టేట్ కమిటీలో తెలంగాణ వాళ్లు 24 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరే ఉన్నారు. వాళ్లు కూడా లొంగిపోవాలని పిలుపునిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు.

# రాష్ట్రపతి, ప్రధానులతో గవర్నర్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

కలుసుకున్నారు. తెలంగాణ గవర్నర్‌గా నియమితులు అయ్యాక ఆయన తొలిసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్మును కలసారు. తనను గవర్నర్‌గా నియమించి పనచేసే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రధాని మోడీతో కూడా ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మోడీ గవర్నర్‌కు అభినందనలు తెలిపారు.

# కేబుల్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు

● వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్న కమిషనర్



**హైదరాబాద్,ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేబుల్ న్యూస్ ఛానల్ జర్నలిస్టులు రాష్ట్ర,జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డులు పొందటానికి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ సి హెచ్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నగర కేంద్రంగా స్టూడియోలు కలిగి, స్థానికంగా, జిల్లాలలో ప్రసారాలు అందించే చానళ్ళు రాష్ట్ర,జిల్లా స్థాయిలో కార్డులు పొందటానికి, జిల్లా స్థాయిలో స్టూడియోలు కలిగిన వారు ఆయా జిల్లాల్లో కార్డులు పొందటానికి నేరుగా ఈ నెల 17 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. దరఖాస్తులో ఛానల్ పేరు మరియు స్టూడియో అడ్రస్ తో పాటు, ఎమ్ ఐ బి సర్టిఫికెట్, లేబర్ లైసెన్స్, ఎం ఎస్ ఓ లతో చేసుకున్న ఛానల్ ప్లేస్మెంట్ అగ్రిమెంట్ల కాపీలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. అర్హత గల ఛానళ్లకు రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో అక్రిడేషన్స్ జారీ చేయబడతాయని వివరించారు.

# సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యం

### జీవన శైలిలో యోగ ఒక భాగంగా అలవర్చుకోవాలి: మంత్రి సీతక్క



**ములుగు జిల్లా, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, రోజువారి జీవనశైలిలో యోగ ప్రక్రియను ఒక భాగంగా దినచర్య అలవర్చుకోవాలని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా బండారుపల్లి గిరిజన భవన్ లో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' హెల్త్ వీక్ లో భాగంగా హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హానిమాన్ 271వ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ హోమియోపతి ( ఆయుష్ డే ) దినోత్సవ యోగ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ యోగా చేయడం ద్వారానే సంపూర్ణమైన ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రజల దినచర్యలో యోగా ఒక భాగంగా అలవర్చుకోవాలని ఉదయం 30 నిమిషాల నుంచి 60 నిమిషాల వరకు యోగ చేయడం ద్వారా శరీరం మెదడు చురుకుగా పనిచేస్తాయని తెలిపారు. పురాతన కాలం నుంచి యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. సంపూర్ణమైన ఆరోగ్యం ద్వారా మాత్రమే మనిషి తన ఆశలను ఆశయాలను ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా యోగ దినచర్యగా అవలంబించుకోవడం ద్వారా శరీరానికి మనసుకి ఉపశమనాన్నిస్తుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ కనీసం 45–50 నిమిషాల యోగా, వ్యాయామం చేయాలని సూచించారు. దీనివల్ల రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చని తెలిపారు. వ్యాయామంతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. మంత్రి, కలెక్టర్, అధికారులు ఆయుష్ సిబ్బంది, క్రీడాకారులు, క్రీడాభిమానులతో కలిసియోగాసనాలు వేసి అందర్నీ ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ గోపాలరావు, కౌన్సిలర్లు, మెడికల్ కళాశాల విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గురువును మర్యాదపూర్వకంగా సత్కరించిన శిష్యుడు సీపతి రాజు



**పరకాల, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా పరకాల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా సేవలందించిన పావుశెట్టి నరసింహా రాములు పదవీవిరమణ పొందిన సందర్భంగా భావోద్వేగభరిత వాతావరణం నెలకొంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన శిష్యుడు సీపతి రాజు తన గురువును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించాడు. ఈ సందర్భంగా నరసింహా రాములు తన శిష్యునికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ గ్రంథాన్ని బహుమతిగా అందజేయడం విశేషం. గురువు–శిష్య సంబంధానికి ఇది ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా నరసింహా రాములు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ సహజమని, కానీ ఉపాధ్యాయుడి బాధ్యత ఎప్పటికీ ముగియదని తెలిపారు. సమాజ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, వారికి సరైన మార్గదర్శకత్వం ఇవ్వడం ఉపాధ్యాయుల ధర్మమని పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు వినయం, విధేయత, సంస్కారం, మానవతా విలువలను నేర్పించడం చాలా ముఖ్యమని అన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకుంటేనే మంచి ఫలితాలు సాధించగలరని సూచించారు. తమ తల్లిదండ్రులకు, తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలంటే క్రమశిక్షణతో ముందుకు సాగాలని చెప్పారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడా ప్రతిభ ఉన్న వారికి విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక ప్రాధాన్యం లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమం గురువు–శిష్యుల మధ్య ఉన్న ఆత్మీయతను ప్రతిబింబించడంతో పాటు, సమాజానికి ఒక ఆదర్శంగా నిలిచింది.

# ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత అభినందనీయం

### మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్

### కల్లూరు బస్టాండ్లో దాతల సహకారంతో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ హర్షణీయం

### ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్





**కల్లూరు, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నూతన బస్టాండులో ప్రతి వేసవిలో ప్రయాణికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని దాతల సహకారంతో సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని కల్లూరు ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ దారావత్ మోహన్ నాయక్ అన్నారు. శుక్రవారం కల్లూరు బస్టాండులో బొగ్గుల బస్విరెడ్డి 80వ జన్మదిన సందర్భంగా వారి కుమారులు బొగ్గుల కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి మజ్జిగ ప్యాకెట్లను ఏర్పాటు చేసినారు. ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులతో ఏఎంసి చైర్మన్ భాగం నీరజాదేవి, మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు తో కలిసి డిపో మేనేజర్ గురజాల లక్ష్మీనారాయణ ప్రారంభించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా విలేజ్ బస్సు ఆఫీసర్ కిన్నెర ఆనందరావు కృషితో వేసవిలో ప్రయాణికులకు ఆర్టీసీ సిబ్బందికి దాతల సహకారంతో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్న సత్తుపల్లి డిపో వారిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్న డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. కల్లూరు మండల పరిధిలోని దాతల దాతృత్వం మరువలేనిది అని డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ అన్నారు. అందరి సహాయ సహకారాలతో సత్తుపల్లి డిపో పరిధిలో కల్లూరు బస్టాండ్ నందు నిరంతరం కూలింగ్ మినరల్ వాటర్ ను ప్రయాణికులకు సిబ్బంది అందుబాటులో ఉంచడం జరిగింది అన్నారు. మజ్జిగ పంపిణీ మొదటి రోజు తన దాతృత్వంతో పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటూ మజ్జిగ అందించిన దాత బొగ్గుల బసివిరెడ్డి ని శాలువతో ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి, ఖమ్మంపాటి వీరస్వామి,16 వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, యాసా శ్రీకాంత్, మాజీ వార్డు సభ్యులు నరసింహారావు, మున్సిపల్ మేనేజర్ నాగేశ్వరావు, జిల్లా యువజన నాయకులు ధరావత రవికుమార్, కంట్రోలర్ యంగల వెంకటేశ్వర్లు, విలేజ్ బస్సు ఆఫీసర్ కిన్నెర ఆనందరావు పాల్గొన్నారు.

# మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన మా ప్రధాన లక్ష్యం

- ములుగు మున్సిపాలిటీ 11వ వార్డ్ కౌన్సిలర్ కేశెట్టి నవీన్



**ములుగు మున్సిపాలిటీ,ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** నూతన ములుగు మున్సిపాలిటీ ములుగు మున్సిపల్ పరిధిలో డ్రైనేజీలు, రోడ్లు, సెంట్రల్ లైటింగ్ మరియు ప్రభుత్వ హామీ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించే అంశాలపై గౌరవనీయులైన సీతక్క గారితో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు తెలియజేసిన ములుగు జిల్లా గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవిచందర్ గారు మరియు ములుగు మున్సిపాలిటీ వార్డ్ కౌన్సిలర్ కేశెట్టి నవీన్ గారు అభివృద్ధి కోసం చర్చించినారు ములుగు మున్సిపాలిటీ 11వ వార్డ్ కౌన్సిలర్ కేశెట్టి నవీన్ గారు మాట్లాడుతూ ములుగు పట్టణ సమగ్ర అభివృద్ధి మరియు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన మా ప్రధాన లక్ష్యం అని తెలియజేశారు

# జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఆయుష్ దినోత్సవం

### ఆయుర్వేద, హోమియోపతి, యునాని సేవలు వినియోగించుకోవాలి: జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్



**మహబూబాబాద్ జిల్లా ఏప్రిల్10(పి.సి.డబ్ల్యూ న్యూస్):** ఆయుర్వేద, హోమియో పతి, యునాని సేవలు వినియోగించుకోవాలన్నారు జిల్లా కలెక్టర్ శుక్రవారం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఆయుష్ దినోత్సవం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసినటువంటి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలలో భాగంగా ఈరోజు ఆయుష్ ఆయుర్వేద, హోమియోపతి, యునాని సేవలు వినియోగించుకోవాలనీ ఈ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందనీ. ఈ రోజు జిల్లా వ్యాప్తంగా అన్ని గురుకుల పాఠశాలలు, హాస్టల్లలో యోగా శిక్షణ తరగతులు ఉదయం 6:30 నుంచి 7:30 వరకు నిర్వహించామని,అదేవిధంగా గ్రామస్థాయిలో ఆయుర్వేద హోమియో యునాని వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగింది. ఈ శిబిరాలలో స్థానిక ఆయుష్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. హోమియో వైద్య విధాన స్థాపకులు అయినటువంటి డాక్టర్ శామ్యూల్ హనిమాన్ జన్మదినం సందర్భంగా ఈరోజు హోమియోపతి దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్లో ఏర్పాటు చేసినటువంటి ఆరోగ్య శిబిరంలో హోమియోపతి వైద్యులు చైతన్య, రామకృష్ణ, ఆయుర్వేద వైద్యులు పి కిరణ్ కుమార్, వసుంధర దేవి, యునాని వైద్యులు బి శంకర్ డిపిమం శ్రవణ్ కుమార్, సిబ్బంది ఇందుమతి, పద్మ, అశోక్, సజయ్, మోహన్ ఉన్నారు. ఈ శిబిరాన్ని ఆమె హనిమాన్ చిత్రపటానికి పుష్పమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శిబిరంలో ఏర్పాటు చేసినటువంటి ఆయుర్వేద మొక్కల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించి తులసి, వేప, ఉసిరి, ద్వారా ఉత్పత్తి అయ్యే మెడిసిన్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విభాగానికి చెందిన డాక్టర్లు ప్రజలను పరిశీలించి వివిధ వైద్య సలహాలు సూచనలు అందించారు, ఈ శిబిరంలో (384) మంది వైద్య సేవలు పొందారు. జిల్లాలో (10) ఆయుష్ డిస్పెనరీ ఉన్నాయని వాటి ద్వారా ముందుగా తెలిపిన షెడ్యూలు ప్రకారం ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు. జిల్లా ప్రధాన కేంద్ర ం తదితర ప్రదేశాలలో ఔషధ మొక్కలను నాటితే ఉపయోగపడుతుందని అందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ రవి రాథోడ్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రసాద్, డాక్టర్ పి కిరణ్ కుమార్, జిల్లా ఆయుష్ ,శ్రవణ్ కుమార్, పాల్గొన్నారు.

# లంబాడి తండా గ్రామ పంచాయతీ సమస్యలను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లిన గ్రామ సర్పంచ్ సాగర్ల లక్ష్మణ్



**బెల్లంపల్లి 10 ఏప్రియల్ (పిసిడబ్ల్యూ న్యూస్):** బెల్లంపల్లి మండలంలోని లంబడి తండ గ్రామపంచాయతీలోని పలు సమస్యలను బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహేందర్ కు లేఖ ద్వారా వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా లంబాడి తండా గ్రామ సర్పంచ్ సాగర్ల లక్ష్మణ్ మాట్లాడుతూ లంబాడి తండ గ్రామంలో 99 రోజుల ప్రణాళికపై చర్చించిన అనంతరం పలు సమస్యలతో పాటు కోతుల బెరద గురించి కోతులు గుంపులుగా రోడ్లపై, ఇళ్ల యొక్క టెర్రస్‌లు, బాల్కనీలు మరియు చెట్లపై స్వేచ్ఛగా తిరుగుతున్నాయని ప్రజలందరు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. కోతులను సురక్షితంగా పట్టుకొని, అటవీ అధికారుల ద్వారా తగిన పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మహేందర్ స్పందిస్తూ ఈ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జీళ్ళ రజీత ప్రశాంత్, రంగ శ్రీలత వేంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు వినతిపత్రం

### డంపింగ్ యార్డ్, సిబ్బంది వేతనాలపై త్వరలో శాశ్వత పరిష్కారం

### కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్



**కల్లూరు, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు కొత్త మున్సిపాలిటీలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణ అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్న డంపింగ్ యార్డ్ సమస్యతో పాటు మున్సిపల్ సిబ్బంది వేతనాల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ కల్లూరు కొత్త మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత పట్టణ అభివృద్ధి దిశగా పలు కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ కొన్ని మౌలిక సమస్యలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా చెత్త నిర్వహణ కోసం శాశ్వత డంపింగ్ యార్డ్ లేకపోవడం వల్ల పారిశుద్ధ్య నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అలాగే సిబ్బంది వేతనాల సమస్య వల్ల పరిపాలనపై ప్రభావం పడుతోందని వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే వాటికి శాశ్వత పరిష్కారం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా కల్లూరు మున్సిపాలిటీని జిల్లాలోనే నెంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చి దిద్దడంలో తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం కృష్ణారెడ్డి, 16 వ వార్డు కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, యువ నాయకులు యాస శ్రీకాంత్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు ధరావత్ రవికుమార్ పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా...






**గంగాధర ఏప్రిల్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ లో ఈరోజు 99 రోజుల ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఈరోజు ప్రపంచ హోమియోపతి దినోత్సవం సందర్భంగా మధురానగర్ గ్రామ5 పంచాయతీలో యోగ మరియు మెడికల్ క్యాంపు మధురానగర్ గ్రామ సర్పంచ్ వేముల భాస్కర్ ఆధ్వర్యంలో ప్రపంచ హోమియోపతి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ శ్రీవాణి వైద్య పరీక్షలు చేసి రోగులకు ఉచితంగా అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సిద్ధాంతి.చిట్టి, ఏఎంసి డైరెక్టర్ పెంచాల చందు,వార్డు సభ్యులు మేడి.సుమన్,యోగ టీచర్ సరస్వతి, ఆశా వర్కర్లు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ యజ్ఞ వరాహ స్వామి హిందూ సమ్మేళనం...






**కరీంనగర్,ఏప్రిల్10(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణం హౌసింగ్ బోర్డ్ కాలనీ, గాయత్రి నగర్ బస్తిల హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. శ్రీ యజ్ఞ వరాహస్వామి హిందూ సమ్మేళనం పేరిట నిర్వహించిన ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులు, వక్తలుగా సి ఎచోళ్ళేటిరమేష్( అధ్యక్షులు),అన్నదానం సుబ్రహ్మణ్యం ,శ్రీ శ్రీ శ్రీ ఆత్మరాం సురేష్ మహారాజ్, డాక్టర్ నీలిమ జిల్లా సంఘ్ చాలాక్ నిరంజనచారిలు హాజరై మాట్లాడారు. సమాజంలో కులాల పేరుతో విభజన పెరుగుతున్న నేపథ్యంలో హిందువులు ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. దేశభక్తి, జాతీయభావం పెంపొందించుకోవాలని సూచించారు. విదేశీ ప్రభావాలను ఎదుర్కొనేందుకు సమాజంలో ఐక్యత అత్యంత అవసరమని, అదిశగా హిందువులంతా ఐక్యమత్యంతో ఉండాలన్నారు. హిందూ సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యంగా హిందూ సమ్మేళనాన్ని నిర్వహించడంఅభినందనీయమన్నారు. ఈ సమ్మేళనంలో హౌసింగ్ బోర్డ్, గాయత్రి నగర్ ప్రజలు, విద్యార్థి విద్యార్థులు 720 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- ఎంపీడీవో శ్రీధర్ రాజుకు వినతి పత్రం అందజేత



**తల్లాడ, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మండలంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని శుక్రవారం ఎంపీడీవో శ్రీధర్ రాజుకు వినతిపత్రం అందించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇల్లు లేక ఎంతోమంది నిరుపేదలు జీవనం సాగిస్తున్నారని, వారిని గుర్తించి పారదర్శకంగా ఇళ్లను ఎంపిక చేయాలని విన్నవించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా సర్వే చేయాలన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఏప్రిల్ నెలలో ఇచ్చేందుకు నిబంధనలు పెట్టారని, ఆ నిబంధనల మేరకు అర్హులైన వారికి ఇల్లు కేటాయించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో నారపోగు ప్రసాద్, రేగళ్ల శ్రీనివాసరావు, కాంపాటి రవి, ఇశ్రాయేలు ఉన్నారు.

## అంగన్వాడీలో పిల్లలకు యూనిఫాంల పంపిణీ



**గంగాధర ఏప్రిల్ 10(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఘర్షకుర్తి గ్రామంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించబడింది. గ్రామ అంగన్వాడి కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో తల్లులకు పోషకాహారం ప్రాముఖ్యతను తెలిపారు. గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నపిల్లల ఆరోగ్య పరిరక్షణలో సమతుల్య ఆహారం విలువలపై వివరించారు.అలాగే అంగన్వాడి కేంద్రం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య పరీక్షలు, టీకాలు, ప్రీ-స్కూల్ విద్య వంటి సేవల గురించి తల్లులకు అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలకు సాంప్రదాయబద్ధంగా సీమంతాల కార్యక్రమం నిర్వహించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రీ-స్కూల్ పిల్లలకు యూనిఫాంలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చిందం ఆంజనేయులు, వార్డ్ సభ్యుడు రామిడి శ్రీనివాస్ అంగన్వాడి ఉపాధ్యాయులు ఎల్లమ్మ, లక్ష్మి, పద్మ, ఉదయశ్రీ తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి మంత్రిని ఆశ్రయించిన చైర్మన్

**డంపింగ్ యార్డ్, సిబ్బంది వేతనాలపై వినతిపత్రం**

**త్వరిత పరిష్కారానికి కలెక్టర్‌కు ఆదేశాలు**



**కల్లూరు, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కల్లూరు కొత్త మున్సిపాలిటీలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ శుక్రవారం కూసుమంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా పట్టణంలో తీవ్రంగా వేధిస్తున్న డంపింగ్ యార్డ్ సమస్యతో పాటు మున్సిపల్ సిబ్బంది వేతనాల చెల్లింపుల సమస్యలను మంత్రివర్యుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ కల్లూరు కొత్త మున్సిపాలిటీగా ఏర్పడినప్పటి నుంచి పలు మౌలిక వసతుల సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా చెత్త నిర్వహణకు తగిన డంపింగ్ యార్డ్ లేకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అలాగే సిబ్బందికి వేతనాల చెల్లింపులో జాప్యం కారణంగా పరిపాలనా వ్యవస్థపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు.విషయాలను శ్రద్ధగా విన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమస్యలపై సానుకూలంగా స్పందించి, త్వరితగతిన పరిష్కారం కోసం సంబంధిత అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. త్వరలోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చినట్లు మున్సిపల్ చైర్మన్ వెల్లడించారు.కల్లూరు అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, ప్రజల అవసరాల మేరకు మౌలిక సదుపాయాల మెరుగుదలకు చర్యలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు శీలం కృష్ణారెడ్డి, 16 వ వార్డ్ కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, యాస శ్రీకాంత్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు ధరావత్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులారా మీ పిల్లలు ప్రమాదానికి గురికాకుండా చూసుకోండి?

**- అన్ని గ్రామాలలో ఇదే పరిస్థితి?.**

**- బైక్ యజమానులకు పోలీసులు అవగాహన కల్పించాలి.**

**- మైనర్ల చేతిలోనే ద్విచక్ర వాహనాలు భారీగా నడుస్తున్నాయి.**



**తొర్రూరు ప్రతినిధి, ఏప్రిల్ 10(పీసీడబ్ల్యూ న్యూస్):** పోలీసులు మీకోసమే అంటారు. ఎక్కడ ఏమి జరిగినా ముందుగా ఆ ప్రాంతంలో కనిపించేది పోలీసులు మాత్రమే. ఈ మధ్యకాలంలో పోలీసులు తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజలకు మేలు చేసే విధంగానే ఉంటుంది. ప్రతి ఒక్క వ్యక్తి దారి వెంట పోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై పోలీసులు ఈ మధ్యకాలంలో ప్రమాదాలకు గురికాకుండా గ్రామాలలో తిరుగుతూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని అవగాహన కార్యక్రమం ప్రయాణికుడికి ఎంతో మేలు కలిగిస్తుందని గ్రామాలలో ప్రతి ఒక్కరు కూడా పోలీసులు తీసుకున్న నిర్ణయం ప్రజల మంచి కోసమే అని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఇంటికి ద్విచక్ర వాహనం ఉంటుంది ద్విచక్ర వాహనదారుడు ఇంటి నుండి హెల్మెట్ ను ధరించి ప్రయాణం చేయాలని తిరిగి తన గమ్యస్థానానికి క్షేమంగా చేరుకున్నప్పుడే ఇంటిలోని వారందరూ సుఖంగా నిద్రిస్తారని అనుకోని ఏదైనా ప్రమాదం జరిగితే తలకు గాయం కాకుండా ఉంటుందని జాగ్రత్త వహించేలా పోలీసులు చేసుకునే నిర్ణయం ప్రతి ఒక్కరికి మేలు కలిగే విధంగా ఉంటుంది. పోలీసులు కూడా ఒక అడుగు ముందుకు వేసి ద్విచక్ర వాహనదారులకు మైనర్ చేతికి వాహనం ఇవ్వకుండా గ్రామాలలో అవగాహనలు కల్పించాలని కొందరు గ్రామస్తులు వారి మనసులోని మాటను వెల్లబుచ్చుతున్నారు. ఇప్పుడు మీరు చూస్తున్న ఈ దృశ్యం 10, 12 సంవత్సరాల పిల్లోడు ద్విచక్ర వాహనంపై వెళుతూ నోటిలో ఐస్ క్రీమ్ పెట్టుకుని వాహనాలు నడిపిస్తూ ఒక చేతిని వదిలేసి వాహనాన్ని వీధులలో అతివేగంగా వెళుతున్న దృశ్యాన్ని గ్రామస్తులు గ్రహించి చిన్న పిల్లల చేతికి వాహనాలు ఇవ్వకూడదని పేర్కొంటున్నారు. ఈ మధ్యకాలంలో ఇద్దరు విద్యార్థులు ( మైనర్) భారీ వాహనాన్ని తీసుకొని పక్క గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు విషసనీయ సమాచారం. కొందరు తల్లిదండ్రులు ఏదో పని నిమిత్తం వారి తనయులకు వాహనాలను ఇవ్వగా మరికొందరు తల్లిదండ్రులకు తెలియకుండా చిన్నారులే వాహనాలను తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం. మనం ప్రతినిత్యం తొర్రూరు మండల కేంద్రంలో మైనర్ ఎక్కువగా వాహనాల నడిపిస్తూ వాహనదారులకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇప్పుడు వచ్చేది వేసేవి సెలవులు కనుక పరీక్షల అనంతరం మైనర్ల చేతికి వాహనాలు వెళ్ళటం సహజంగానే ఉంటుంది. ద్విచక్ర వాహనాలే కాకుండా పొలం పనుల నిమిత్తం ట్రాక్టర్లను కూడా మైనర్లు నడపటంవిశేషం. మైనర్లు వాహనాలు నడిపేటప్పుడు వారికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తెలియక ముందు వెనుక వెళ్తున్న వాహనదారులు ఇబ్బందులు పడక తప్పడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో పోలీసులు గ్రామాల వారీగా తల్లిదండ్రులకు ద్విచక్ర వాహనాల విషయంలో అవగాహన కల్పిస్తూ చిన్నారుల ప్రాణాలకు ముప్పు కలగ కుండా చూసే విధంగా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**• ఇప్ప పువ్వు , తేనె సేకరణతో మహిళా సంఘాలకు మెరుగైన ఉపాధి • అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు • అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ: మంత్రి సీతక్క**






**ములుగు జిల్లా,ఏప్రిల్ 10(పీసీడబ్ల్యూ న్యూస్):** పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని,ఇప్ప పువ్వు , తేనె సేకరణతో మహిళా సంఘాలకు మెరుగైన ఉపాధి లభిస్తుందని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందుతుందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.శుక్రవారం ములుగు జిల్లా సమ్మక్క సారలమ్మ తాడ్వాయి మండలం గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని అన్నారం గ్రామంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 15 లక్షల రూపాయల సి ఆర్ ఆర్ నిధుల తో చేపట్టనున్న అంతర్గత సి.సి. రోడ్ల నిర్మాణ పనులకు, అంకంపల్లి గ్రామంలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఐటిడిఎ నిధులు సుమారు 83 లక్షలతో ఆర్ అండ్ బి రోడ్డు నుండి అంకంపల్లి వరకు బిటి రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క శంకుస్థాపన చేశారు. అదే గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేశారు. పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్టాలను పంపిణీ చేశారు. స్థానిక అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి మౌలిక సదుపాయాల కల్పన పలు అంశాలపై అంగన్వాడి చిన్నారులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని మారుమూల ప్రాంతాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు.అంకంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్ట్ ద్వారా అన్ని మౌలిక వస్తువులు కల్పిస్తూ మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని, గతంలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ప్రజలకు రవాణా సౌకర్యాలను కల్పించడం కోసం ఆర్ అండ్ బి రోడ్డు నుంచి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని అత్యంత నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ రోడ్డు పనులు చేపట్టాలని సూచించారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు.గూడు లేని ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవతో ములుగు నియోజకవర్గానికి 5000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని త్వరలోనే అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం రెండో విడతను ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా స్థానిక ఉత్పత్తులైన ఇప్ప పువ్వు తేనె సేకరణ వంటి పనులను చేపట్టడం ద్వారా మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని పేర్కొన్నారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని, మెనూలో ఎటువంటి లోపాలు చూసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో వివిధ కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో ఆన్లైన్ శిక్షణకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్హత గల అభ్యర్థులు ఆన్లైన్లో ఈ నెల 25వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. కంప్యూటర్ సాఫ్ట్వేర్ రంగంలో రాణించేందుకు అవసరమైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లార్నింగ్ బిజినెస్ అనలిటిక్స్, దేవోప్స్, ఫుల్ స్టాక్ డెవలప్మెంట్, పైథాన్, డేటా సైన్స్ బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్, ప్రాజెక్ట్ మేనేజ్మెంట్, బ్లాక్ చైన్ వంటి 100కి పైగా కంప్యూటర్ సర్టిఫికేషన్ కోర్సుల్లో ఆన్లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రధానం చేస్తారు. కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ విదేశాలలో ఉత్తమ ఉపాధి, ఉద్యోగ అవకాశాలున్నట్లు తెలిపారు. వివరాలకు ఆన్లైన్: www.nationalskillacademy.in వెబ్సైట్ ద్వారా లేదా సెల్ నంబర్: 9505800050 లో సంప్రదించాలని సూచించారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**• వరితో పాటు అంతర పంటలు కూడా ప్రోత్సహించాలి: ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్**






**కల్లూరు, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో చంద్రుపట్ల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగశీ నీరజ ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ భాగం నీరజా దేవి మాట్లాడుతూ సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి ఆదేశాల మేరకు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, భట్టి విక్రమార్క సూచన మేరకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. వరితోపాటు అంతర పంటలు వేసుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మలుచుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చంద్రుపట్ల గ్రామ సర్పంచ్ కాటమనేని విజయలక్ష్మి, ఉప సర్పంచ్ పైళ్ల రాధాకృష్ణ, చెన్నూరు సొసైటీ సీఈవో వెంకటేశ్వరరావు, ఏఎంసి డైరెక్టర్ లింగనబోయిన పుల్లారావు, వార్డు సభ్యులు దుగ్గిరాల సీతారాములు, జినుగు విజయదాసు, గ్రామ నాయకులు మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ గొల్లమందల ప్రసాదు, నాయకులు వల్లపనేని అప్పారావు, తూము నరసింహారావు, పరిగడుపు ముత్తయ్య, మోదుగు గోవిందు, మాగంటి ప్రభాకర్, పైళ్ల నాగేశ్వరరావు, తిప్పారెడ్డి నరసింహారావు, నెల్లూరు జగదీష్, చప్పిడి నరసింహారావు, ఆముదాల శ్రీను రైతులు పోట్రు నరసింహారావు, నెల్లూరు వీరభద్రరావు, కాటమనేని కృష్ణారావు, గోసు కృష్ణారావు పంచాయతీ సెక్రెటరీ లక్ష్మణ్, సిబ్బంది, గ్రామ రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సబ్‌స్టేషన్ మరమ్మతులతో నేడు పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం

**• ఉదయం 9 నుంచి 11.30 వరకు సరఫరా నిలిపివేత**

**వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి**

**కల్లూరు, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో బత్తులపల్లి సబ్‌స్టేషన్‌లో నిర్వహించనున్న మరమ్మతుల పనుల కారణంగా శనివారం పలు గ్రామాల్లో తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ కల్లూరు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు విద్యుత్ శాఖ మండల అధికారి మహేంద్ర బాబు ఒక ప్రకటనలో వివరించారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11:30 గంటల వరకు బత్తులపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని బత్తులపల్లి, సాంబయ్య బంజర, రామకృష్ణపురం, కొత్త నారాయణపురం, కోర్లగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌లో సాంకేతిక మరమ్మతులు మరియు నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో భద్రతా చర్యల భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేత సమయంలో ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వ్యాపారులు, రైతులు, గృహ వినియోగదారులు తమ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సహకరించాలని కోరారు. మరమ్మతుల పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. సంబంధిత ప్రాంతాల ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించి అసౌకర్యాన్ని సహించాలన్నారు.ఈ మేరకు ఏఈ, కల్లూరు విద్యుత్ శాఖ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.

# హిందువుల ఆరాధ్యదైవం గోమాత

**• తెలంగాణ లౌఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్**



**హైదరాబాద్, ఏప్రిల్ 10(పి సి డబ్ల్యూ న్యూస్):** హిందువుల ఆరాధ్య దైవం గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించి సంరక్షించాలని తెలంగాణ గో సంరక్షణ, అధ్యాత్మిక, సేవా సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ లౌఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్, ట్రస్టీ, తరుణ్ మెహతా, చైతన్య మహా ప్రభు, మహా భారత్ ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి ఏబీ చైతన్యదాస్, గీతాష్ జీ, శ్రీనివాస్ రావు, మనీషా మెహతా, గోపినాథ్, డాక్టర్ రోహిత్ కాలే, వినయ్ కృష్ణదాస్, కృష్ణ మురళి, దేవదాసి తదితరులు మాట్లాడారు. భారతీయులు గోమాతను విశిష్ట దేవతగా కొలుస్తారన్నారు. గోమాతలో అనేకమైన శక్తులు ఉన్నాయన్నారు. గో సంరక్షణ, భగవద్గీత, సనాతన ధర్మం వ్యాప్తి, ఆధ్యాత్మిక జాగృతి కోసం త్వరలో గచిబౌలి స్టేడియంలో ఛారిటీ క్రికెట్ మ్యాచ్, సంగీత కచేరీని నిర్వహించనున్నట్లు వారు ప్రకటించారు. సనాతన ధర్మం, విలువలతో స్వర్ణ భారత్ను స్థాపించి ప్రపంచ శాంతిని పరిరక్షించడమే లక్ష్యంగా పనిచేస్తామని వారు తెలిపారు.

# సత్తుపల్లి తిరుపతి సూపర్ లగ్జరీ బస్సు చార్జీల తగ్గింపు



**సత్తుపల్లి, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :**సత్తుపల్లి నుండి తిరుపతి వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు చార్జీల ను తగ్గించినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రాలో తిరిగే సూపర్ లగ్జరీ బస్సులకు ఆంధ్ర సెక్టార్ లో 16 నుండి 40 శాతం వరకు రాయితీ కల్పిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. గుంటూరు తిరుపతి మధ్య18 శాతం(రూ.110), చిలకలూరిపేట తిరుపతి మధ్య19 శాతం(రూ100), ఒంగోలు తిరుపతి మధ్య 22%(రూ30), నెల్లూరు తిరుపతి మధ్య 24%(రూ20), నాయుడుపేట తిరుపతి మధ్య 33%(రూ30), శ్రీకాళహస్తి తిరుపతి మధ్య 40 శాతం (రూ 20) రాయితీ ప్రకటించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. కావున సత్తుపల్లి డిపో పరిధిలోని తిరుపతి వెళ్లే భక్తులు ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ కోరారు.

# వెంకటట్ రెడ్డి నగర్ అభివృద్ధికి ఎన్నికలే మార్గం: హరీష్

**రెండు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు తప్పనిసరి**

**రాజకీయాలకు అతీతంగా అభ్యర్థులు ఉండాలి**

**కాలనీలో బస్ షెల్టర్ వినియోగంపై దృష్టి**

**రాత్రి వేళల్లో పోలీస్ గస్తీ అవసరం**

**ఇంటి నెంబర్ల లేమితో గుర్తింపు సమస్యలు**

**నివాసితుల పూర్తి వివరాల సేకరణపై సూచన**

**అసోసియేషన్ చొరవతో సమస్యల పరిష్కారం**

**గ్రేటర్ మల్కాజ్గిరి ఎన్నికల్లో ప్రాతినిధ్యం లక్ష్యం**



**ఉప్పల్, ఏప్రిల్ 10 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** వెంకట్ రెడ్డి నగర్ డెవలప్మెంట్ అసోసియేషన్ ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మడి పోజు హరీష్ డిమాండ్ చేశారు. బైలా ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరగాల్సి ఉన్నప్పటికీ, కొన్నేళ్లుగా అవి నిర్వహించకుండా ఆలస్యం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అసోసియేషన్ ఎన్నికల్లో రాజకీయాలకు అతీతంగా ఉన్న వ్యక్తులు మాత్రమే పోటీ చేయాలని, అప్పుడు మాత్రమే కాలనీ అభివృద్ధి సాధ్యమవుతుందని హరీష్ స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం కీలకమని, అందరూ కలిసికట్టుగా సహకరించాలని పిలుపునిచ్చారు.కాలనీలో మౌలిక సదుపాయాలపై కూడా ఆయన దృష్టి సారించారు. మాజీ రాజ్యసభ సభ్యుడు దేవేందర్ గౌడ్ నిధులతో నిర్మించిన బస్ షెల్టర్ ప్రజలకు సక్రమంగా ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రాత్రివేళ దొంగ తనాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ గస్తీ ఏర్పాటు చేయించేందుకు అసోసియేషన్ తరపున పోలీస్ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేయా లని కోరారు.ఇంటి నెంబర్ల లేమి వల్ల గుర్తింపు సమస్య లు తలెత్తుతున్నాయని, కాలనీలో నివసిస్తున్న సొంత ఇళ్ల యజమానుల వివరాలను సేకరించి, పారదర్శ కంగా ఎన్నికలు నిర్వహించాలని హరీష్ పేర్కొన్నారు. వెంకట్ రెడ్డి నగర్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయడం శుభపరిణామమని, రానున్న గ్రేటర్ మల్కాజి గిరి ఎన్నికల్లో ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం దక్కాలని ఆకాంక్షించారు.

# చొప్పదండి వీక్లీ మార్కెట్లో కరీంనగర్ దారుల్ ఖైర్ సొసైటీ వారి చలివేంద్రం ప్రారంభోత్సవం....



**చొప్పదండి,ఏప్రిల్10(పీసీడబ్ల్యూ న్యూస్):** చొప్పదండి మున్సిపల్ పట్టణ పరిధిలో కరీంనగర్ దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం అంగడి కూరగాయల వారసంత (వీక్లీ మార్కెట్)లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ వడ్లూరి సరిత శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, వారసంతకు వచ్చే వినియోగదారులు మరియు చిరు వ్యాపారులకు తాగునీటి సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఖుద్దుస్ మాట్లాడుతూ, తెలంగాణ వ్యాప్తంగా నిరుపేద ప్రజలు, విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని తమ సంస్థ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, ఆశీర్వాదాలే తమకు బలమని అన్నారు.సొసైటీ చొప్పదండి అధ్యక్షుడు ఎం.డి. అబిద్ అలీ మాట్లాడుతూ, ప్రతి వేసవికాలంలో గత కొన్నేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, అలాగే శీతాకాలంలో కులమతాలకు అతీతంగా నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.చొప్పదండి బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడున సింహాచలం ప్రభాకర్ ఆచార్యులు మాట్లాడుతూ, మతం కంటే మానవత్వమే ముఖ్యమని, మానవ సేవే మాధవ సేవగా భావిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులను





అభినందించారు. నిరుపేదలకు సేవ చేయడంలో దైవ కృప ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మానస గంగయ్య గౌడ్‌తో పాటు కౌన్సిలర్లు కొట్టే అశోక్, చిల్ల శ్రవణ్ కుమార్, కొత్త సుమలత గంగారెడ్డి, గుర్రం సుజీత్ రెడ్డి, పిట్టల వెంకటేష్, ముద్దం తిరుపతి, జిట్ట మంగ కుమార్ పాల్గొన్నారు. అలాగే సొసైటీ ప్రతినిధులు అహ్మద్ అల్ జైదీ, షకీల్ అహ్మద్, నజీబ్ అహ్మద్, జమలొద్దీన్, అజీమ్ ఖాన్, ఇంజనీర్ షకీల్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎం.డి. ఖాజా అలి, ఎండి సాజిద్ అలీ, ఎండి ఆసిఫ్ (వతన్) ఎండి గౌస్, ఆసిఫ్ తదితరులు హాజరయ్యారు.

# మహనీయుల విగ్రహాలనుసగర్వంగా ఆవిష్కరించుకుందాం...!

**• తిమ్మాపూర్ జేఏసి నేతలతో ఎమ్మెల్యే కవ్వంపల్లి**



**తిమ్మాపూర్,ఏప్రిల్10(పీసీడబ్ల్యూ న్యూస్):**కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ముందు గత 4 ఏళ్ళ క్రితం నెలకొల్పిన బాబు జగ్జీవన్ రాం, డా.అంబేద్కర్ విగ్రహాల ముసుగులు తొలగించి ఆవిష్కరించేందుకు ప్రభుత్వ పరమైన అనుమతులు వచ్చాయని, త్వరితగతిన మిగతా పనులు పూర్తి చేసి సగర్వంగా, ఘనంగా ఆవిష్కరణ కార్యక్రమం చేసుకుందామని మానకొండూర్ ఎమ్మెల్యే, పిసిసి ఎస్సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తిమ్మాపూర్ మండల రాజకీయ, ప్రజాసంఘాల జేఏసి నేతలతో పేర్కొన్నారు.సాంకేతిక కారణాలతో ఆవిష్కరణకు నోచుకోకుండా ముసుగులతో ఉన్న మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు అనుమతులు లభించినందుకు తిమ్మాపూర్ మండల రాజకీయ,ప్రజాసంఘాల జేఏసి పక్షాన శుక్రవారం ఏమ్మెల్యే ను క్యాంప్ కార్యాలయం లో కలిసి ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహనీయుల విగ్రహాల సుందరీకరణ,ఆవిష్కరణ కార్యక్రమాలకు ప్రభుత్వం ద్వారా సుమారు 50 లక్షల నిధులను మంజూరు చేయించి అట్టి స్థలాన్ని సుందరంగా నిర్మింకుందామని ఎమ్మెల్యే పేర్కొన్నట్లు జేఏసి సభ్యులు తెలిపారు.విగ్రహాల ఆవిష్కరణ అనుమతుల విషయం లో ఆర్టిసి ఎండి నాగిరెడ్డి తో మాట్లాడగా సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 14 న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి జయంతి వరకు సుందరీకరణ పనులు పూర్తి కావు కాబట్టి కొంత సమయం తీసుకొని పూర్తి స్థాయిలో పనులు చేసి మంత్రులను, ముఖ్యనాయకులను, గతంలో కృషి చేసిన వారిని పిలిపించుకొని పెద్దఎత్తున కార్యక్రమం నిర్వహించుకుందామని ఎమ్మెల్యే పేర్కొనట్లు జెఏసి సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్లు మాతంగి శంకర్, సుగుర్తి జగదీశ్వరాచారి, వంతడ్పుల సంపత్, దుండ్ర రాజయ్య, సముద్రాల లక్ష్మణ్,కనకం రాములు,మాజీ సర్పంచ్ లు బోయిని కొమురయ్య, మేడి అంజయ్య,మీసాల అంజయ్య,కవ్వంపల్లి పద్మ, మాతంగి లక్ష్మణ్,పోన్నాల సంపత్,నాయకులు కన్నం లక్ష్మన్,అలువాల కోటి,సంగుపట్ల మల్లేశం,ఎంఆర్పిఎస్ అధ్యక్షులు అలువాల సంపత్,కొయ్యడ మురళి,రెడ్డిగాని రాజు,మామిడి అనిల్,మేకల సతీష్,కన్నం నర్సయ్య,సాగర్,లింగం కుమార్,దావ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు గూడెం దళితుల భూసమస్య పరిష్కారం...



**- హామీ నిలుపుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి**

**- కృతజ్ఞతలు తెలిపిన రాసూరి,అలువాల**

**బెజ్జంకి,ఏప్రిల్10(పీసీడబ్ల్యూ న్యూస్):** బెజ్జంకి మండలం గూడెం గ్రామానికి చెందిన 35 మంది దళితులకు సంబంధించిన భూసమస్య పరిష్కారానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఇచ్చిన హామీని నిలుపుకున్నారు. గత బీఆర్ఎస్ హయాంలో ఈ గ్రామ పరిధిలో గల 63.18 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి 35 మంది లబ్ధిదారులకు భూమి రిజిస్ట్రేషన్ చేశారు. అయితే గత 8 సంవత్సరాలుగా భూసర్వే, మ్యుటేషన్ పెండింగ్ లో పెట్టడంతో ఆ భూములు వారికి దక్కకుండా పోయాయి.

ఈ సమస్యను అసెంబ్లీ ఎన్నికల సమయంలో గూడెం గ్రామానికి ప్రచారానికి వచ్చిన సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి ఆర్టీఐ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్ తీసుకువెళ్లారు. సమస్య తీవ్రతను తెలుసుకున్న కవ్వంపల్లి ఎమ్మెల్యేగా గెలిపిస్తే తప్పకుండా సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా, ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దళితుల సమస్య పరిష్కారానికి పూనుకున్నారు. అందులో భాగంగానే జిల్లా కలెక్టర్ తో పాటు రెవిన్యూ యంత్రాంగాన్ని సమన్వయం చేసి గూడెం భూ లబ్ధిదారులకు ముటేషన్,భూసర్వే చేయించిన మీదట ఆ భూములపై సదరు దళితులకు హక్కు కల్పిస్తూ వాటి స్వాధీనపర్చారు. దీంతో చాలా కాలంగా అపరిష్కృతంగా ఉంటున్న దళితుల భూసమస్యకు ఎట్టకేలకు పరిష్కారమైంది. గూడెం దళితులకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే కవ్వంపల్లి నిలుపుకు న్నట్టయింది.ఇదిలా ఉండగా, గూడెం దళితుల భూసమస్యను పరిష్కారానికి పాటుపడి మాట నిలుపుకున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను ఆర్టీఐ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్ అలువాల కోటి, దళిత సంఘాల నాయకులు సముద్రాల లక్ష్మణ్, రెడ్డిగాని రాజు, మామిడి అనిల్, మీసాల అంజయ్య, బోయిని కొమురయ్య, ఎలుక రాజు, మాతంగి లక్ష్మణ్, కన్నం లక్ష్మణ్ శుక్రవారం క్యాంపుకార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనా రాయణను శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

# విజువల్ లెర్నింగ్‌తో విద్యలో విప్లవం... పిల్లల్లో ఆసక్తి రగిలిస్తున్న డా. యాసిన్ అన్వర్ బాషా

**హైదరాబాద్ ఏప్రిల్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** పిల్లల్లో చదువుపై ఆసక్తి తగ్గుతున్న నేపథ్యంలో, పుస్తకాలకే పరిమితమైన బోధనకు బదులుగా విజువల్ లెర్నింగ్ ద్వారా విద్యను ఆకర్షణీయంగా మార్చే దిశగా వినూత్న ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ మార్పుకు మార్గదర్శకుడిగా నిలుస్తూ, చూసి నేర్చుకునే విధానంతో విద్యలో కొత్త దిశను చూపిస్తున్నారు ప్రముఖ విద్యావేత్త డా. యాసిన్ అన్వర్ బాషా. సాంప్రదాయ విద్యా విధానంలో పాఠ్యపుస్తకాలపై ఆధారపడిన బోధన ఎక్కువగా ఉండటంతో, విద్యార్థులు కేవలం గుర్తుపెట్టుకునే విధానానికే పరిమితమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో విజువల్ లెర్నింగ్ ఒక శక్తివంతమైన ప్రత్యామ్నాయంగా ఎదుగుతోంది. చిత్రాలు, వీడియోలు, యానిమేషన్స్, గ్రాఫిక్స్ వంటి సాధనాల ద్వారా పాఠాలను బోధించడం వల్ల క్లిష్టమైన అంశాలు సైతం సులభంగా అర్థమవుతాయి. విజువల్ లెర్నింగ్ ప్రత్యేకత ఏమిటంటే, ఇది పిల్లల సహజ స్వభావానికి దగ్గరగా ఉంటుంది. చిన్న వయసు నుంచే పిల్లలు చూసి, అనుభవించి నేర్చుకునే అలవాటు కలిగి ఉంటారు. అదే లక్షణాన్ని బలోపేతం చేస్తూ, విద్యను బోర్‌గా కాకుండా ఆసక్తికరమైన అనుభవంగా మలుస్తుంది. ఫలితంగా, క్లాస్‌రూమ్‌లో విద్యార్థుల పాల్గొనడం పెరిగి, వారు సబ్జెక్ట్‌పై లోతైన




అవగాహనను పొందుతున్నారు. ఈ విధానం వల్ల విద్యార్థుల జ్ఞాపకశక్తి మెరుగుపడటమే కాకుండా, సృజనాత్మకత కూడా పెరుగుతోంది. ఒక కాన్సెప్ట్‌ను కేవలం చదవడం కంటే, దాన్ని చిత్ర రూపంలో లేదా వీడియో ద్వారా చూడడం వల్ల అది మెదడులో ఎక్కువకాలం నిలిచిపోతుంది. ఇదే విజువల్ లెర్నింగ్ ప్రధాన బలం. విద్యా వ్యవస్థలో కూడా ఈ మార్పు గణనీయమైన ప్రభావాన్ని చూపుతోంది. టీచర్ కేంద్రిత బోధన నుంచి స్టూడెంట్ కేంద్రిత అభ్యాసానికి మార్పు చోటు చేసుకుంటోంది. డిజిటల్ కంటెంట్ వినియోగం పెరిగి, పాఠశాలలు సాంకేతికతను మరింతగా ఉపయోగించుకుంటున్నాయి. విద్యార్థులు కేవలం పరీక్షల కోసం చదవడం కాకుండా, జీవితానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. ఈ మార్పును సాధించేందుకు కృషి చేస్తున్న డా. యాసిన్ అన్వర్ బాషా విజన్ స్పష్టంగా కనిపిస్తోంది. చదువు అంటే ఒత్తిడి కాదు, ఆనందం అనే భావనను పిల్లల్లో నాటాలని ఆయన సంకల్పం. అందుకోసం విజువల్ లెర్నింగ్‌ను ఒక శక్తివంతమైన సాధనంగా మార్చుకుని, విద్యను అనుభవాత్మకంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. వీడియోలు, కథలు, యానిమేషన్స్ ద్వారా పాఠాలను చెప్పడం వల్ల విద్యార్థులు క్లాస్‌రూమ్‌లో చురుకుగా పాల్గొంటూ, నేర్చుకోవడాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇది కేవలం బోధన పద్ధతి మార్పు మాత్రమే కాదు, పిల్లల ఆలోచనా విధానాన్ని మార్చే ఒక విద్యా సంస్కరణగా భావిస్తున్నారు నిపుణులు. విజువల్ లెర్నింగ్ అనేది భవిష్యత్తు విద్యకు దిశానిర్దేశం చేసే శక్తిగా ఎదుగుతోంది. ఈ మార్గంలో డా. యాసిన్ అన్వర్ బాషా వంటి విద్యావేత్తల కృషి, విద్యను కొత్త ఎత్తులకు తీసుకెళ్లే దిశగా మార్గం సుగమం చేస్తోంది. పిల్లల్లో ఆసక్తిని రగిలించే ఈ మార్పు, రాబోయే తరాల భవిష్యత్తును మరింత ప్రకాశవంతంగా తీర్చిదిద్దనుంది.

# పెద్ద కోరుకొండి సబ్ స్టేషన్ నందు విద్యుత్ సరఫరా అంతరాయం

**కల్లూరు, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో పెద్ద కోరుకొండి సబ్‌స్టేషన్‌లో నిర్వహించనున్న మరమ్మతుల పనుల కారణంగా శనివారం పలు గ్రామాల్లో తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ పెద్ద కోరుకొండి విద్యుత్ శాఖ ఏఇ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు పెద్ద కోరుకొండి సబ్‌స్టేషన్ పరిధిలోని చెన్నూరు, వెన్నవల్లి, చిన్న కోరుకొండి, తెలగారం, మర్లపాడు, తాళ్లూరి వెంకటాపురం, లింగాల, పాత ఎర్రబోయినపల్లి, కొత్త ఎర్ర బోయినపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌లో సాంకేతిక మరమ్మతులు మరియు నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో భద్రతా చర్యల భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేత సమయంలో ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మరమ్మతుల పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు విద్యుత్ శాఖ పెద్ద కోరుకొండి ఏఈ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.

# విగ్రహావిష్కరణల ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే....



**తిమ్మాపూర్, ఏప్రిల్10(పీసీడబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ పక్కన మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ ఏర్పాట్లను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబూ సాహెబ్ అంబేడ్కర్, భారత ఉప రాష్ట్రపతి బాబూ జగ్జీవన్ రామ్ ల విగ్రహాలను నెలకొల్పినప్పటికీ అనుమతులు లేని కారణంగా ఆవిష్కరణకు నోచుకోవడం లేదు. అయితే రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తోపాటు సంబంధిత అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కలిసి గట్టి ప్రయత్నాలు చేయడంతో ఎట్టకేలకు విగ్రహాల ఆవిష్కరణలకు అనుమతులు లభించాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విగ్రహాల ఆవిష్కరణలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వారం రోజుల్లో అన్ని హంగులతో పనులు పూర్తి చేసి ఘనంగా విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, మామిడి అనిల్ కుమార్, పోలు రాము, రమేశ్, మాతంగి లక్ష్మణ్, సముద్రాల లక్ష్మణ్, ఒగ్గు దామోదర్ తదితరులు ఉన్నారు. **ఎమ్మెల్యేను సన్మానించిన దళిత సంఘాల నేతలు** తిమ్మాపూర్ మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ ల విగ్రహాల ఆవిష్కరణకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించడంలో కీలక భూమిక పోషించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి దళిత నాయకులు,అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో జిల్లా వారీ నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలి: కీర్తి సంతోష్ రాజ్

**సంఘంలో ఐక్యతే ప్రధాన బలం**

**బైలాలో ఉన్న విధివిధానాలను తప్పకుండా పాటించాలి**

**నా వాడునీ వాడు అనే భేద భావాలు సంఘాన్ని బలహీనపరుస్తాయి**

**ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ప్రశ్నించే హక్కు ఉంది**

**ఓపిక, సహనం లేని నాయకత్వం ఉంటే యువతకు బాధ్యతలు ఇవ్వాలి**

**రాజకీయాలను పక్కనబెట్టి సంఘ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి**

**ఎన్నికల్లో జిల్లా వారీ నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలి**

**హైదరాబాద్ ఏప్రిల్ 10(పిసిడబ్ల్యూ న్యూస్:)** సంఘంలో ఐక్యత, పారదర్శకత, ప్రజాస్వామ్య విలువలు పాటించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని సీనియర్ జర్నలిస్ట్, సీనియర్ నాయకుడు కీర్తి సంతోష్ రాజ్ అన్నారు. బైలాలో పేర్కొన్న విధివిధానాలను కచ్చితంగా అనుసరించాల్సిన అవసరం ఉందని, కొందరి వ్యక్తిగత అభిప్రాయాల ప్రభావంతో సంఘాన్ని బలహీనపరచకూడదని సూచించారు. సభ్యులను నా వాడునీ వాడు అనే భేదాలతో చూడడం సంఘానికి హానికరమని ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి సభ్యుడికి ప్రశ్నించే హక్కు ఉంటుందని, ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పే బాధ్యత నాయకత్వంపై ఉంటుందని స్పష్టం చేశారు. సమస్యలు తీసుకొచ్చిన సభ్యులను ప్రోత్సహించి, వాటికి పరిష్కారం చూపడమే నాయకుల అసలు బాధ్యత అని తెలిపారు. పెద్దలు ఓపిక, సహనం కోల్పోతే యువతకు బాధ్యతలు అప్పగించాలని, లేదంటే నాయకత్వంపై గౌరవం తగ్గే ప్రమాదం ఉందని కీర్తి సంతోష్ రాజ్ పేర్కొన్నారు. సంఘంలో చిన్న చిన్న పొరపాట్లను సహనంతో సరిదిద్దుకునే సంస్కృతి పెంపొందించుకోవాలని సూచించారు. రాజకీయాలను పక్కనబెట్టి సంఘ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. వివిధ జిల్లాల్లో జరిగే ఎన్నికల్లో ఆయా ప్రాంతాలకు చెందిన నాయకత్వాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత అధిష్టానంపై ఉందన్నారు. సంఘ సభ్యులు ఎన్నికల్లో పాల్గొనేటప్పుడు పెద్దలు పూర్తి సహకారం అందించాలని కోరారు. భవిష్యత్ తరాలకు సంఘ పెద్దలు మార్గదర్శకులుగా నిలవాలని, ప్రతి సభ్యుడు అభివృద్ధిలో భాగస్వామి కావాలని కీర్తి సంతోష్ రాజ్ ఆకాంక్షించారు.



# నేడే మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి

**● మహాత్మ జ్యోతిరావు పూలే ఐడియాలజీ సొసైటీ, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ముస్తాబౌతున్న పూలే సభా ప్రాంగణం ● మహాత్మా జ్యోతిరావుపూలే 199వ జయంతిని విజయవంతం చేయండి**





**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారతదేశంలోని ప్రముఖ సామాజిక సంస్కర్త, విద్యావేత్త, సమానత్వ ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావుపూలే అని, ఆయన జీవితం సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి అంకితం అయిందని, ఆయన 199వ జయంతిని మహా ఉత్సవంలా జరపాలని మహాత్మ జ్యోతిరావుపూలే ఐడియాలజీ సొసైటీ, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నాయకులు పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలోని ఆర్ అండ్ బి అతిథిగృహం ఎదురుగా మహాత్మ జ్యోతిరావుపూలే జయంతిని ఘనంగా నిర్వహించేందుకు శుక్రవారం పూలే సభా ప్రాంగణాన్ని ముస్తాబ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మనం పుట్టక ముందే మన హక్కుల కోసం పోరాడిన మహనీయులు మహాత్మ జ్యోతిరావుపూలే 199వ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు మేధావులు, విద్యావేత్తలు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని ఆ మహనీయునికి ఘనమైన నివాళి అర్పించాలని కోరారు. మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు పూలే సభ ప్రాంగణాన్ని ఏర్పాటుచేస్తున్న వారిలో నిర్వాహకులు పెళ్లూరి విజయ్ కుమార్, దాసరి రాజశేఖర్, కత్తి నెహ్రూ, చిలుముల అజయ్, కుదురుపాక నరసయ్య, మల్లెల లక్ష్మీపతి తదితరులున్నారు.

# కష్టాల్లో ఉన్నా సంక్షేమ పథకాల కొనసాగిస్తాం: ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి స్పష్టీకరణ...




**తిమ్మాపూర్,ఏప్రిల్10(పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికపరమైన ఇబ్బందులున్నప్పటికీ సంక్షేమ పథకాలు కొనసాగిస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో ఆయన తిమ్మాపూర్ మండలానికి చెందిన143 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం కొనసాగుతున్నదని, ఆర్థికపరిస్థితిని కారణంగా చూపుతూ సంక్షేమ పథకాలను ఆపబోమని స్పష్టం చేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ఆ పథకాలను కొనసాగిస్తూ ముందుకు వెళతామన్నారు. గతంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల కోసం ఎదురు చూడాల్సి వచ్చేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు 24విడుతల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశామని, 24వ విడుతలో 143 మందికి 40.94 లక్షల రూపాయలు మంజూరు కాగా, వాటిని ఇప్పుడు చెక్కుల రూపేణా పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి రమేశ్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, మామిడి అనిల్ కుమార్, తమ్మనవేణి రమేశ్ యాదవ్, చింతల లక్ష్మారెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, బుధారపు శ్రీనివాస్, తమ్మనవేణి రాములు యాదవ్,ఎల్కరాజు, రెడ్డి రాజు, పోలు రాము, రమేశ్, గోదారి తిరుపతి, పొన్నాల సంపత్, కసిరెడ్డి ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. **కాల్వను పరామర్శించిన కవ్వంపల్లి** నగర పాలక సంస్థ పరిధిలోని 7వ డివిజన్ కార్పొరేటర్ కాల్వ మల్లేశం ను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ఇటీవల కాల్వ మల్లేశం సోదరుడు ఇంద్రసేన్ అనారోగ్యంతో మరణించగా శుక్రవారం అల్గునూరులోని ఆయన స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మరణానికి గల కారణాలను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట 7వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టి.రమేశ్ యాదవ్, పార్టీ నాయకులు కంది లక్ష్మినారాయణ రెడ్డి, కంది పెద్ద అశోక్ రెడ్డి, కంది చిన్న అశోక్ రెడ్డిలు ఉన్నారు. **కాలభైరవుని ఎమ్మెల్యే ప్రత్యేక పూజ** కాళ అష్టమిని పురస్కరించుకొని తిమ్మాపూర్ మండలం అలుగునూరు లోని శ్రీ కాలభైరవ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం ఈ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో ఎమ్మెల్యేతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కంది అశోక్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.








# 12న మేడ్చల్ జిల్లా (పడమట శాఖ) భట్రాజు సంఘం ఎన్నికలు..



**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** మేడ్చల్ జిల్లా పడమట శాఖ భట్రాజు సంక్షేమ సంఘం ఎన్నికలు 12 న ఆదివారం సూరారంలోని కృషి హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కూరపాటి కరుణాకర్ రాజు,ప్రధాన కార్యదర్శి లోలుబట్టు కృష్ణంరాజు శుక్రవారం నాడు ఒక ప్రకటనలు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎన్నికల ప్రక్రియ మొదలై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని కుత్బుల్లాపూర్,కూకట్పల్లి, బాచుపల్లి,బాలానగర్, దుండిగల్ మండలాలకు చెందిన బంధువులు హాజరై ఎన్నికల అనుకూలంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు!





**ఉప్పల్ ఏప్రిల్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** యువ నాయకత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న బస్తీ బాట కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. గత నవంబర్ 12, 2025న జరిగిన బస్తీ బాటలో ప్రజలు తమ సమస్యలను యువ నాయకుడు ఆకారపు అరుణ్ పటేల్ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల్ల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో నిధుల మంజూరుకు కృషి చేశారు. రూ.1 కోటి నిధులతో అభివృద్ధి పనులువెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరియు సీసీ రోడ్ల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు కాలనీ వాసులకు ప్రొసీడింగ్స్ (మంజూరు పత్రాలను) పరమేశ్వర్ రెడ్డి స్వయంగా అందజేశారు. శ్రీనివాసపురం కాలనీ (స్ట్రీట్ నం. 3): రూ. 20 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం శ్రీనివాసపురం కాలనీ: రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం రామ్ రెడ్డి నగర్ (స్ట్రీట్ నం. 9, 8, 3): రూ. 36 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం వాసవి నగర్ (స్ట్రీట్ నం.  నుండి విజ్ఞాన్ జోతి హైస్కూల్ వరకు: రూ. 25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక చొరవ తీసుకున్న మందముల్ల పరమేశ్వర్ రెడ్డి కి ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ కాలనీ వాసులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.మేడ్చల్ మల్కాజిగిరి కార్పొరేషన్ లోనే వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌ను ఒక ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం. త్వరలోనే మిగతా కాలనీల్లో కూడా మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తాం. ఈ కార్యక్రమంలో రామ్ రెడ్డి నగర్, వెంకట్ రెడ్డి నగర్, వాసవి నగర్, శ్రీనివాసపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# గోపు అంజిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే....






**మానకొండూర్,ఏప్రిల్10(పీసీడబ్ల్యూ న్యూస్):** మానకొండూర్ మండలం రంగపేట గ్రామానికి చెందిన గోపు అంజిరెడ్డి కాంగ్రెస్ నేత ఇటీవల మరణించగా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ద్వావ శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, రంగపేట, మద్దికుంట గ్రామాల సర్పంచులు రాంరెడ్డి, బుర్ర శ్రీధర్ గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోంద్ర సురేశ్ తదితరులు పాల్గొన్నారు.**పెళ్లి వేడుకకు ఎమ్మెల్యే హాజరు** మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామంలోని మణికంఠ ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగిన జూల సరమ్మ - ఎల్లయ్య పుత్రిక వివాహానికి  వివాహానికి హాజరై టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మెన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్షితలు వేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ వివాహ వేడుకలో మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ఒగ్గు దామోదర్, బండారి రమేశ్, మోరపల్లి రమణారెడ్డి, ద్వావ శ్రీనివాస్ రెడ్డి,ముక్కెర సతీష్ కుమార్, తిరుమల్ రెడ్డి , కోంద్ర సురేష్, కనుకం రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం డాడీ లంబాడీలకు స్మశాన వాటిక కేటాయించాలి

- డీఎల్‌హెచ్‌ఎస్ డిమాండ్
- పూర్వీకుల స్థలాన్ని పరిరక్షిస్తూ అదనంగా 5 ఎకరాలు ఇవ్వాలని విజ్ఞప్తి



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం డాడీ లంబాడీల స్మశాన వాటిక సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని డీఎల్‌హెచ్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు రూడావత్ రఘు నాయక్ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం డాడీ లంబాడీల స్మశాన వాటికను సందర్శించి, భూమి హద్దులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డీఎల్‌హెచ్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి డోంగ్రోత్ శేఖర్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రూప్‌సింగ్ నాయక్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు రాజు నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి శీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న స్మశాన వాటికను కొనసాగించడమే కాకుండా, పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని అదనంగా ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ స్థలం డాడీ లంబాడీల పూర్వీకులకు చెందినదని, ప్రస్తుతం అది శిథిలావస్థలో ఉందని తెలిపారు.స్మశాన వాటికలో జేసీబీ ద్వారా తవ్వకాలు చేయకుండా, అక్కడి చెత్త, చెట్లను తొలగించి ప్రదేశాన్ని శుభ్రపరచాలని సూచించారు. ముందుగా స్మశాన వాటికకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, అవసరమైతే స్థానిక దాతల సహకారంతో పనులు చేపట్టాలని, లేకపోతే ఆ ఖర్చులను రాష్ట్ర కమిటీ భరిస్తుందని స్పష్టం చేశారు. అధికారులతో ఇప్పటికే చర్చలు జరిపినట్లు పేర్కొంటూ, కరకట్టకు సంబంధించిన రిటైనింగ్ వాల్ నిర్మాణంతో పాటు కాలువ రోడ్డు కూడా మంజూరైందని తెలిపారు. పూర్వీకుల స్మశాన వాటికకు ఎటువంటి హాని కలగకుండా కాపాడటం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ఈ సమస్య పరిష్కారం కోసం డీఎల్‌హెచ్‌ఎస్ ఎల్లప్పుడూ ప్రజల వెంట ఉంటుందని హామీ ఇచ్చారు.

# పాలిటెక్నిక్ విద్యార్థులు నైపుణ్యాలతో భవిష్యత్‌ను నిర్మించాలి: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**పరకాల, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా వీక్షించి వారిని అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచుకుని భవిష్యత్తులో మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. దేశ అభివృద్ధి యువత చేతుల్లోనే ఉందని, వారు సరైన దిశలో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు.ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి




ఉందని, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టెక్నాలజీలో వేగంగా వస్తున్న మార్పులను అనుసరించి విద్యార్థులు తమను తాము తీర్చిదిద్దుకోవాలని, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టిస్తూ ఇతరులకు ఉపాధి కల్పించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఆధునిక



సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని చిన్న పరిశ్రమలను స్థాపించి ఆర్థికంగా ఎదగాలని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. కళాశాల అభివృద్ధి కోసం అవసరమైన మౌలిక వసతుల కల్పనలో తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఐదో వార్డు కౌన్సిలర్ గౌడుగు రజిత నాగరాజు, బండి శ్రీధర్ పాల్గొన్నారు.

# ప్రశ్నించే వారిని బంధించే యత్నంలో కేంద్రం

- ప్రజాస్వామిక వాదులపై ఎన్ఐఏ కేసులు ఉపసంహరించుకోవాలి
- సిపిఐ జాతీయ సమితి సభ్యులుబాగం

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రశ్నించే వారిని నిర్బంధించి గొంతు నొక్కే ప్రయత్నంలో కేంద్రం పనిచేస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. ఆ క్రమంలోనే ప్రజాస్వామిక వాదులపై జాతీయ దర్యాప్తు సంస్థ చేత విచారణకు పిలిపించి కేసులు నమోదు చేస్తున్నారని ఆయన తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. సిపిఐ (ఎంఎల్) మాస్లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావును విచారణకు పిలవడం ప్రజాస్వామికవాదుల గొంతు నొక్కడమేనన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నించడం ప్రభుత్వ చట్ట వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకుపోయి ప్రజలను చైతన్యపర్చడం వామపక్ష వాదులుగా మా కర్తవ్యమని మా కర్తవ్య నిర్వహణను అడ్డుకునే అధికారం ఈ ప్రభుత్వానికి లేదన్నారు. అర్బన్ నక్సలైట్ పేరుతో దేశంలోని బిజెపి వ్యతిరేక ప్రజాస్వామిక వాదులను అరెస్టు చేసి జైళ్లలో ఉంచుతారా అని ఆయన ప్రశ్నించారు. మొన్నటి వరకు జై శ్రీరామ్ జై మోడీ అన్నవారే దేశభక్తులని చిత్రీకరించారని ఇప్పుడు ప్రశ్నించే వారికి అర్బన్ నక్సలైట్ ముద్ర వేస్తారా అని హేమంతరావు ప్రశ్నించారు.



సుదీర్ఘ కమ్యూనిస్టు పార్టీ ప్రస్థానంలో అనేక బెదిరింపులను, నిర్బంధాలను చవిచూశామని కానీ అకారణంగా జాతీయ దర్యాప్తు సంస్థను విపక్ష నాయకులపైకి ఉసిగొల్పిన ఏకైక ప్రభుత్వం మోడీ ప్రభుత్వమేనని ఆయన తెలిపారు. ఇందుకు ప్రతిఫలం అనుభవించక తప్పదని ఆయన హెచ్చరించారు. నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజా సంక్షేమం కోసం, సమాజాభివృద్ధి కోసం కృషి చేసే వారి పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యంలోని భావస్వేచ్ఛ హక్కును హరించడమేనన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు, సంపన్న వర్గాలకు మాత్రం ఊడిగం చేస్తుందని ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. యుద్ధ నేపథ్యంలో దేశం ఒక సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటుందని ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ దేశంపై యుద్ధ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ మోడీ మౌన ముద్రలో ఉన్నారని హేమంతరావు తెలిపారు. మోడీ, ట్రంప్ ఒప్పందం భారతదేశ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపనుందని ఆయన స్పష్టం చేశారు. సిపిఐ(ఎంఎల్) మాస్లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగా రావుపై ఎన్ఐఏ నమోదుచేసిన కేసును ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామిక వాదులపై కేసులు నమోదు చేస్తే ప్రతిఘటన తప్పదని ఆయన హెచ్చరించారు.

# ప్రజా ప్రభుత్వంలో విద్య, వైద్యానికి పెద్దపీట

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచి మండలానికి చెందిన 191 మందికి మొత్తం 58 లక్షల 58 వేలు సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కులు పంపిణీ
- పేదవాళ్లకు పూర్తిగా అండగా ఉంటూ వైద్యానికి గతంలో కంటే రెట్టింపు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యకు, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ఎక్కువ నిధులు వెచ్చిస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి  శుక్రవారం ఖమ్మం



జిల్లా, కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్ లతో కలిసి కూసుమంచి  మండలానికి చెందిన 191 మందికి మొత్తం 58 లక్షల 58 వేలు సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వైద్యానికి, విద్యకు పెద్దపీట వేయడమే కాకుండా ప్రతి పేదవానికి భరోసా కల్పించి ఆరోగ్య విషయంలో ఎవరికైనా అనారోగ్యం  కలిగిన సందర్భంలో పూర్తిగా అండగా ఉండి ఎన్ని కోట్లు ఖర్చు అయినా వెనకడుగు వేయకుండా వెచ్చిస్తున్నదని, రాష్ట్ర వ్యాప్తంగా గతంలో



కంటే రెండు రెట్లు అదనంగా పేదలకు భారం కాకుండా వైద్యానికి ఖర్చు చేస్తూ పేదలకు అండగా ప్రభుత్వం నిలుస్తున్నదని, ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి చేయూత అందిస్తూ సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, జిల్లా అధికారులు, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాలకు వెన్నుదన్నుగా యలమందల జగదీష్



- 20 నిరుపేదలకు కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యావసర సరుకుల పంపిణీ

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆపదలో ఉన్న 20 నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు పంపిణీ చేసి ఆ కుటుంబాలకు వెన్నుదన్నుగా ఎలక్ట్రానిక్ మీడియా ఖమ్మం నగర అధ్యక్షులు, నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర ప్రెసిడెంట్ యలమందల జగదీష్ నిలిచారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1వ డివిజన్ కైకొండాయిగూడెంకు చెందిన 20 నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యవసర సరుకులను, 25 కేజీల బియ్యంను యలమందల జగదీష్ అందజేశారు. ఈ సందర్భంగా కైకొండాయిగూడెం పేద ప్రజలు మాట్లాడుతూ.. వేసవికాలం కావడం



సరైన పనులు దొరకక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మా పేద కుటుంబాలకు నెల రోజుల పాటు సరిపడే నిత్యవసర సరుకులు 25 కేజీల బియ్యం అందజేసి మా కుటుంబాలకు పెద్దన్నగా జగదీష్ అన్న నిలిచాడని ఆయన చేసిన మేలు మరచిపోమని ఏదో ఒక రకంగా ఆయన రుణాన్ని తీర్చుకుంటామని వారి కుటుంబ సభ్యుల సాక్షిగా హామీ ఇచ్చారు. మా కడుపులు నింపి మమ్ములను ఆదుకున్న జగదీష్ అన్న నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని వారు దీవించారు. ఈ సందర్భంగా యలమందల జగదీష్ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి పాల్గొన్న ప్రతి ఒక్కరికి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, కైకొండాయిగూడెం ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభాస్ లెజెండ్

## దురంధర్ దర్శకుడు ఆదిత్యధర్ కితాబు



బాలీవుడ్ సెన్సేషన్ డైరెక్టర్ ఆదిత్య ధర్ మన రెబల్ స్టార్ ప్రభాస్ కు 'లెజెండ్' అంటూ కితాబిచ్చేశారు. రెబల్ స్టార్.. ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ఇవి ప్రభాస్ ను ఫ్యాన్స్ ముద్దుగా పిలుచుకునే పేర్లు. ఈశ్వర్ తో మొదలైన ప్రభాస్ జర్నీ నేడు దేశం గర్వించే రేంజ్ కు చేరుకుంది. కానీ మన డార్లింగ్ చాలా సింపుల్ గా కూల్ గా ఉంటాడు తప్ప స్టార్‌డమ్ గురించి ఎప్పుడూ గొప్పలు చెప్పుకోరు. ఎంతటి వారైనా ప్రభాస్ తో కలిసి వర్క్ చేసారంటే ప్రేమలో పడిపోవాల్సిందే. తాజాగా ఇటీవల సందీప్ రెడ్డి వంగాతో కలిసి 'ధురంధర్ 2' సినిమాను వీక్షించారు ప్రభాస్. అయితే, సినిమా చూసి సైలెంట్‌గానే వెళ్ళిపోయాడు డార్లింగ్. కనీసం సోషల్ మీడియాలో రివ్యూ కూడా ఇవ్వలేదు. కానీ, ఆ సినిమా దర్శకుడు ఆదిత్య ధర్ స్పందించిన తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా చేసిన పోస్ట్‌కు రిప్లై ఇచ్చిన ఆదిత్య.. 'ది లెజెండ్ ప్రభాస్ సర్‌కి నా ప్రేమను తెలియజేయండి' అంటూ ట్వీట్ చేశారు. ఇక్కడి నుంచి సోషల్ మీడియాలో లెజెండ్ ప్రభాస్ ట్యాగ్స్ ఓ రేంజ్‌లో ట్రెండ్ అవుతున్నాయి. ఇప్పటికే సందీప్ రెడ్డి వంగా ఆయనను 'ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్' అనే బిరుదు ఇచ్చారు. ఇప్పుడు మరో సంచలన దర్శకుడు ఆదిత్య ధర్ ఏకంగా 'ది లెజెండ్' అని ట్యాగ్ ఇవ్వడంతో.. రెబల్ స్టార్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో రచ్చ రచ్చ చేస్తున్నారు. ఆదిత్య ధర్ లాంటి దర్శకులు ప్రభాస్ పట్ల చూపిస్తున్న ఈ గౌరవం చూస్తుంటే, ఆయన కేవలం ఒక నటుడు మాత్రమే కాదు, ఇండియన్ సినిమాకు ఒక బ్రాండ్ అని కామెంట్స్ చేస్తున్నారు.

# కథనంలో కొత్తదనం

## డెకాయిట్‌గా ఫర్వాలేదనిపించిన అడవిశేష్

అడివి శేష్ డబుల్ హ్యాట్రిక్ విజయాలతో జోరు మీదున్నారు. పైగా 'మేజర్'తో జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నాడు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'డెకాయిట్'పై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ మంచి అంచనాలు ఏర్పడ్డాయి. హరిదాస్ (అడివి శేష్) ఓ హత్య కేసులో 13 ఏళ్లుగా జైలు జీవితం అనుభవిస్తుంటాడు. ఓరోజు తనని కడప జైలు నుంచి మారుస్తుండగా పోలీసుల నుంచి తప్పించు కుంటాడు. దీనికోసం ఇషాద్ భాయ్ (అతుల్ కులకర్ణి) అతనికి సాయం చేస్తాడు. హరి అలా తప్పించుకోగానే తనని దుబాయ్ పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేయగా.. దానికోసం ఇంకా రూ.60లక్షలకు పైగా డబ్బు అవసరమవుతుంది. అయితే అతను దుబాయ్‌కి వెళ్లేలోపు తనకు అవసరమైన డబ్బు సంపాదించడంతో పాటు మరో పని కూడా చేయాలనుకుంటాడు. తనని జైలు పాలయ్యేలా చేసిన తన మాజీ ప్రేయసి సరస్వతి అలియాస్ జూలియట్ (మృణాల్ ఠాకూర్)పై పగ తీర్చుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఈక్రమంలోనే ఆమెను వెతుక్కుంటూ ఇంటికెళ్లగా ఓ ఆరేళ్ల కూతురి తల్లిగా దర్శనమిస్తుంది సరస్వతి. ఆమె భర్త భాస్కర్ (వైభవ్) తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలై ఉంటాడు. తన ప్రాణాలు కాపాడాలంటే ఆమెకు రూ.1కోటి డబ్బు అవసరం. ఆమె పరిస్థితిని చూసిన హరి.. తన ఆర్థిక అవసరాన్ని అడ్డం పెట్టుకునే దెబ్బ కొట్టాలని ఓ ప్రణాళిక రచిస్తాడు. హరిని సరస్వతి హత్య కేసులో ఎందుకు ఇరికించింది? దీనికి ఆమె భర్త భాస్కర్‌కు ఉన్న లింకేంటి? ఈ కథలో సీఐ స్వామి అలియాస్ రాంబాబు (అనురాగ్ కశ్యప్), కరుణ హాస్పిటల్స్ ఛైర్మన్ (ప్రకాశ్ రాజ్), మల్లి



(కామాక్షి భాస్కర్ల) పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటన్నదే కథ. అడివి శేష్ సినిమా అనగానే ప్రేక్షకుల్లో బలమైన భరోసా కనిపిస్తుంది. తను ఓ కథ ఎంచుకున్నాడంటే తప్పకుండా అందులో ఏదో వైవిధ్యత ఉంటుందని.. థ్రిల్‌కు ఏ లోటు ఉండదని అందరి నమ్మకం. ఇక ఈసారి 'డెకాయిట్'కి తనే స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించాడనే సరికి దీనిపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత రెట్టింపయ్యాయి. కథ, కథనాల్లో మరీ అంత కొత్తదనమేమీ లేకపోయినా కొన్ని మెరుపులతో ఆ లోటు తెలియనీయలేదు. ఓ కులాంతర ప్రేమకథకు.. తనదైన శైలిలో ట్విస్ట్‌లు, టర్న్‌లు జోడించి ఓ మాస్ యాక్షన్ సినిమాని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు శేష్ . హీరో ఎప్పుడైతే జైలు నుంచి తప్పించుకుంటాడో అక్కడి నుంచి సినిమా వేగం పుంజుకుంటుంది. హీరో ఎప్పుడైతే కథానాయిక జీవితంలోకి తిరిగి ఎంట్రీ ఇస్తాడో అక్కడి నుంచి కథలో సంఘర్షణ మొదలవుతుంది. వాళ్లిద్దరూ కలిసి డబ్బు దోచుకునేందుకు సిద్ధమైనప్పటి నుంచి ఆ సంఘర్షణ రెట్టింపవుతుంది. ఓ వైపు నాయకానాయికల్ని వెతికి పట్టుకునేందుకు సీఐ స్వామి రంగంలోకి దిగడం.. వాళ్లని తప్పించుకుని, కథానాయికని పోలీసులకు పట్టించాలని హీరో చేసే ప్రయత్నాలతో ద్వితీయార్థం థ్రిల్లింగ్‌గా మొదలవుతుంది. క్లైమాక్స్‌ని భావోద్వేగభరితంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో హీరో చేసే త్యాగం 'ప్రేయసి రావే' లాంటి క్లాసిక్ చిత్రాన్ని గుర్తు చేస్తుంది. కాకపోతే ఆ ముగింపును ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారన్న దానిపై చిత్ర ఫలితం ఆధారపడి ఉంది. హరిదాస్ పాత్రలో మాసీ లుక్స్‌లో అడివి శేష్ కనిపించిన విధానం.. తన నటన.. మదనపల్లి యాసలో పలికిన సంభాషణలు అన్నీ ప్రేక్షకుల్ని అలరిస్తాయి. యాక్షన్‌తో పాటు భావోద్వేగభరిత సన్నివేశాల్లోనూ అదరగొట్టారు. తన

జూలియట్‌గా సరస్వతి పాత్రలో మృణాల్ ఒదిగిన తీరు ఆకట్టుకుంటుంది. అడివి శేష్ రాసుకున్న కథలో కొత్తదనం లేదు. స్క్రీన్‌ప్లేతో తనదైన శైలిలో అక్కడక్కడా మ్యాజిక్ చేసే ప్రయత్నం చేశారు. భీమ్స్ నేపథ్య సంగీతం, పాటలు ఆకట్టుకుంటాయి. ఛాయాగ్రహణం.. నిర్మాణ విలువలు బాగున్నాయి.

## కొరియన్ కనకరాజు నుంచి కమ్సాహంనిదా పాట ప్రోమో

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు' . ఇండో-కొరియన్ నేపథ్యంలో హారర్-కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.




## మైఖేల్ జాక్సన్ బయోపిక్ ట్రైలర్ విడుదల విడుదల

ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న పాప్ రారాజు మైఖేల్ జాక్సన్ బయోపిక్ 'మైఖేల్' ఫైనల్ ట్రైలర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది . ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్ పోషిస్తుండగా, ట్రైలర్‌లో ఆయన బాడీ లాంగ్వేజ్, డ్యాన్స్ మూమెంట్స్ మరియు లుక్ అచ్చం మైఖేల్ జాక్సన్‌ను తలపిస్తుండటం విశేషం. దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా తెరకెక్కించిన ఈ ట్రైలర్‌లో 'బీట్ ఇట్', 'థ్రిల్లర్', 'బిల్లీ జీన్' వంటి ఐకానిక్ సాంగ్స్ ప్రదర్శనలతో పాటు, మైఖేల్ వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగ అంశాలను, బాల్యంలో ఆయన ఎదుర్కొన్న సంఘర్షణలను మరియు వివాదాలను ఎంతో ఆకట్టుకునేలా చూపించారు. ఆస్కార్ విజేత గ్రాహమ్ కింగ్ నిర్మించిన ఈ చిత్రంలో కోల్‌మన్ డొమింగో, నియా లాంగ్, మైల్స్ టెల్లర్ వంటి హాలీవుడ్ ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. కేవలం ఒక సంగీత ప్రయాణంలా కాకుండా, ఒక లెజెండరీ స్టార్ జీవితంలోని ఎత్తుపల్లాలను ఆవిష్కరించే ఈ చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్ని హంగులతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

-------



## దళపతి విజయ్ చివరి సినిమాకు షాక్..

# 'జన నాయగన్' సీన్స్ లీక్!

దళపతి విజయ్ పూర్తిస్థాయి రాజకీయ ప్రవేశానికి ముందు నటిస్తున్న చివరి చిత్రం 'జన నాయగన్'కు భారీ షాక్ తగిలింది. ఈ సినిమాకు సంబంధించిన 5 నిమిషాల నిడివి గల ఒక వీడియో క్లిప్ సోషల్ మీడియాలో లీక్ అయింది. టైటిల్ క్రెడిట్స్, విజయ్ ఇంట్రడక్షన్ సీన్‌తో కూడిన ఈ వీడియో వేగంగా వ్యాపిస్తుండటంతో చిత్రబృందం, అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

ఈ వీడియో లీక్ కావడం వెనుక కుట్ర కోణం ఉందని విజయ్ అభిమానులు ఆరోపిస్తున్నారు. దీన్ని ఎవరూ షేర్ చేయవద్దని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఎడిట్ టేబుల్ నుంచే ఈ వీడియో బయటకు వచ్చి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ వెంటనే రంగంలోకి దిగి, ఎక్స్ (ట్విట్టర్) వంటి ప్లాట్‌ఫామ్‌ల నుంచి లీకైన వీడియోలను తొలగించే చర్యలు ప్రారంభించింది. వాస్తవానికి ఈ చిత్రం జనవరి 9నే విడుదల కావాల్సి ఉండగా, కొన్ని సన్నివేశాలు ప్రజా మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఫీజ) అభ్యంతరం తెలపడంతో వాయిదా పడింది. నెల రోజుల న్యాయపోరాటం తర్వాత, మేకర్స్ సినిమాను రివైజింగ్ కమిటీకి పంపారు. విజయ్ 'తమిళగ వెట్రి కళగం' (ఐఖ) పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేస్తుండటంతో, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ముగిశాకే ఈ చిత్రానికి సెన్సార్ క్లియరెన్స్ రావొచ్చని ప్రచారం జరుగుతోంది. రూ. 500 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమాలో విజయ్ సరసన పూజా హెగ్డే, బాబీ డియోల్, మమితా బైజు, ప్రకాశ్ రాజ్, గౌతమ్ మీనన్, ప్రియమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు.




## దసరాకు రిలీజ్ చేసేలా ..ఫౌజీ షూటింగ్ స్పీడ్

ఈ ఏడాది ఆరంభంలో రాజాసాబ్‌తో ఫ్లాప్ ఇచ్చిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇదే ఏడాదిలో సాలిడ్ హిట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ప్రభాస్ నుంచి 'ఫౌజీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీతారామం తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అఫీషియల్‌గా ప్రకటించనప్పటికీ.. వచ్చే దసరాకు ఫౌజీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. కానీ ఈ ఏడాది డిసెంబరు పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఈ సినిమాను ముందుగా అనుకున్న సమయానికే ప్రేక్షకులకు అందించాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం నిర్మాణ పనులను ముమ్మరం చేస్తూ ఏకకాలంలో షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేయడం కోసం మేకర్స్ 'సెకండ్ యూనిట్'ను కూడా రంగంలోకి దించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఒక వైపు ప్రధాన తారాగణంపై దర్శకుడు హను రాఘవపూడి అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా, మరోవైపు ఈ సెకండ్ యూనిట్ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్‌ను షూట్ చేస్తోందట. ఇలా రెండు యూనిట్‌లతో పని చేయడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, క్వాలిటీ విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా అవుట్‌పుట్ వస్తుందని టీమ్ భావిస్తోంది.

